
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
5
సోమవారం 22 ఏప్రిల్ 2024



కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించండి

● వైఎస్ వివేకా కుమార్తె సునీత

చక్రాయపేట, ఏప్రిల్ 21: కడప పార్లమెంట్‌కు కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేస్తున్న ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, పులివెందుల అసెంబ్లీ అభ్యర్థి ధ్రువకుమార్‌రెడ్డిలను గెలిపించాలని వివేకా కుమార్తె సునీత, పీసీసీ మీడియా చైర్మన్ తులసిరెడ్డిలు ఓటర్లను అభ్యర్థించారు. ఆదివారం మండలంలోని గండి, అద్దాలమర్రి, చెరువుకాంపల్లె, కుమార్లకాల్వ, సిద్దారెడ్డిగారిపల్లి, తక్కశ్లపల్లె, కల్లూరిపల్లె తదితర గ్రామాలలో వారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రూ.2లక్షల వరకు రైతు రుణమాఫీ చేస్తుందని, మహాలక్ష్మి పథకం కింద ప్రతి పేద మహిళ ఖాతాలో రూ.8333 ప్రతి నెల వేస్తుందన్నారు. రూ.500కే వంటగ్యాస్ సిలిండర్, రూ.5లక్షలతో పేదలకు ఇళ్లు, వృద్ధులకు, వితంతువులకు రూ.4వేలు, వికలాంగులకు రూ.6వేలు ప్రతినెల ఇస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పులివెందుల అసెంబ్లీ అభ్యర్థి ధ్రువకుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్‌కు ఓటు వేయాలని మహిళలను కోరుతున్న వైఎస్ సునీత

హామీల మల్లు.. అమలు నిల్లు..!

ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు మాటల మాంత్రికుడు. గంట సమయం ఇస్తే ఈ భూమిమీద తనకంటే నిజాయితీ గలవాడు.. ప్రజల పట్ల ప్రేమ గలవాడు ఇంక లేడని ఒప్పించేంత ఘనాపాటి. ఆఖరికి అతని మాటలు నమ్మడానికి సొంత తల్లిదండ్రుల మాన ప్రాణాలను సైతం పణంగా పెట్టగల తెగింపు గలవాడు. సోషల్ మీడియాలో అతని మాటలొక ట్రెండ్. ఆ ట్రెండ్‌ను ఎవ్వరూ బీట్‌చేయలేక చతికలబడాల్సిందే. మాట ఇచ్చాడంటే అంతే.. ఇంక ఇచ్చిన మాటను మర్చిపోవాల్సిందే.. అంటారు అతని వెంట దగ్గరగా తిరిగేవాళ్లు.

"ప్రొద్దుటూరులో ఇళ్లులేని పేదలందరికి రెండు సెంట్లలో స్థలం ఇచ్చి ఒక్కరూపాయి లబ్ధిదారుల నుంచి తీసుకోకుండా ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇచ్చి... ఒకచేత్తో పట్టా, మరోచేత్తో ఇంటి తాళం ఇవ్వకుంటే తూ నాకొడకా అని ఉమ్మేయండి" అని 2019 ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే రాచమల్లు ప్రజలకు హామీ ఇచ్చారు. ఇళ్లు నిర్మించకపోతే 2024 ఎన్నికల్లో ఈమొహంతో ఓట్లు అడగటానికి రానని చెప్పాడు. కానీ ఆ హామీ నెరవేర్చకనే మళ్లీ ఓట్లు అడగడానికి వస్తున్నాడు.



ఆగిపోయిన వైఎస్ఆర్ ఇంజనీరింగ్ కాలేజ అదనపు తరగతుల నిర్మాణం



పిల్లర్లదశలో నిలిచిపోయిన మార్కెట్ నిర్మాణపనులు

- ఏడాదికి రూ.500 కోట్లతో అభివృద్ధి అన్నారు
- అమృతనగర్‌ను సింగపూర్ టౌన్‌షిప్ చేస్తానన్నారు
- ఉర్దూ డిగ్రీ కాలేజీ తెస్తానన్నారు
- తాను చదువుకున్న కాలేజీని అభివృద్ధి చేస్తానన్నారు
- రెండు సెంట్లలో ఇళ్లు కట్టించి ఇవ్వకపోతే..
- తూ నాకొడకా అనమన్నారు..
- ఐదేళ్లు దాటినా.. ఒక్క హామీ నెరవేరలేదు
- ఇదీ ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు హామీల అమలు తీరు

ప్రొద్దుటూరు, ఏప్రిల్ 21: ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు ప్రజల్లో ఎక్కడికి వెళ్లినా ఆయన నోటివెంట మొదటగా వచ్చే నినాదం సొంతనిధులతో అభివృద్ధి చేస్తా.. ఆదుకుంటా అని. 2019 ఎన్నికల సమయంలో జగన్ ప్రజాసంకల్ప యాత్ర పేర పాదయాత్రగా ప్రొద్దుటూరుకు వచ్చినప్పుడు.. జగన్ సమక్షంలోనే ఏటా రూ.500 కోట్ల నిధులు తెచ్చి ఐదేళ్లలో రూ.2500 కోట్లతో ప్రొద్దుటూరు రూపురేఖలు మార్చుతామన్నారు. ఇందుకోసం జగన్ మంత్రి పదవి ఇస్తానన్నా త్యాగం చేసి అభివృద్ధికోసం నిధులు తెస్తానని ప్రకటించారు. కానీ ఐదేళ్లకుగాను ప్రొద్దుటూరు నియోజకవర్గానికి రూ.513 కోట్లమేర పనులు మంజూరు చేస్తే.. వాటిలో ఏ ఒక్కటీ పూర్తి కాలేదు. అందుకు సంబంధించి కేవలం రూ.10 కోట్లమేర బిల్లులు ఇచ్చిన దాఖలాలు లేవనేది అధికారుల మాట. ఆయన మున్సిపాలిటీలో గత పాలకులు మిగిల్చిన కోట్లరూపాయల జనరల్ ఫండ్‌ను కరిగించి పారేశారు. ఆయన నోటనే రూ.120 కోట్ల మేర మున్సిపల్ నిధులు ఖర్చుచేశానని తెలిపారు. 2019 ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుంటే ఈ ఎన్నికల్లో తన ముఖం చూపనని రాచమల్లు చెప్పారు. మరి ఆ మాటను కూడా రాచమల్లు నిలబెట్టుకుంటాడని జనం నమ్మే పరిస్థితి లేదు. అందుకే ఆయన ధైర్యంగా 2024లో ప్రచారం చేయగలుగుతున్నాడని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

అమృతనగర్‌ను సింగపూర్‌టౌన్‌షిప్ చేస్తానని..

జగన్ అధికారంలోకి వస్తే అమృతనగర్‌ను సింగపూరు టౌన్‌షిప్ చేస్తానని ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు హామీ ఇచ్చారు. సింగపూరు ఏమోగానీ పంచాయతీ కంటే అధ్వాన్నంగా ఆ ప్రాంతంలో వసతులు లేమితో ప్రజలు సతమతమౌతున్నారు. డ్రైనేజీ వ్యవస్థ లేక మురికి కూపంగా మారిపోయింది. అడ్డరోడ్ల నిర్మాణం కాక ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాగునీటి పైపులైను పనులు పూర్తి చేయలేదు.

మున్సిపాలిటీ పరిధిలో ఇచ్చిన హామీలు

- ప్రొద్దుటూరుకు ఉర్దూడిగ్రీ కాలేజీ మంజూరు, కళాశాల భవన నిర్మాణం చేస్తానని ఇచ్చిన హామీ నెరవేర్చలేదు.
- ఎస్సీఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో తాను చదువుకున్నానని కళాశాలను రూ.24 కోట్లతో ఆధునీకరిస్తామని హామీ ఇచ్చి 23డిసెంబరు 2021న శిలాఫలకం వేశారు. ఇంకా టెండర్లు ఫైనల్ కాలేదు.
- దోమలు లేని ప్రొద్దుటూరుగా మార్చుతానని దశరాకు అల్లుళ్లను తప్పెట్లతో తీసుకొస్తామని చెప్పి హామీ ఇచ్చాడు. మురుగునీటి కాలువ పనులు ప్రారంభంకాలేదు.
- రూ.119 కోట్లతో పట్టణంలో నూతన భూగర్భ తాగునీటి పైపులైను ఏర్పాటుతో పాటు కొత్తరిజర్వాయర్ల నిర్మాణం చేపడతామని టెండర్లు పూర్తిచేశారు. పనులు ఇంకా ప్రారంభం కాలేదు.
- జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని రూ.20.50 కోట్లతో అభివృద్ధి చేస్తానని శిలాఫలకం వేసి రెండేళ్లయిన పనులకు నోచుకోలేదు.
- ప్రొద్దుటూరు-ఆర్టీపీపీ మార్గం మధ్య పెన్నానదిమీద హైలెవల్ వంతెనను రూ.53 కోట్లతో చేపట్టిన పనులు ఇంకా పిల్లర్ల దశ దాటలేదు. ఈ పనులకు పైసా బిల్లురాలేదు.
- ఆర్టీసీ బస్టాండ్ ఆధునిక భవన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి.
- వైఎస్సార్ ఇంజనీరింగ్ కళాశాలలో అదనపు తరగతి గదులు, మౌలిక సదుపాయాల కోసం ఏర్పాటుకు రూ.66 కోట్లు కేటాయించినా ఆ పనులు ఇంకా పునాది దశలోనే ఉన్నాయి.
- ప్రొద్దుటూరు నడిబొడ్డున ఉన్నపాత కూరగాయల మార్కెట్‌ను 2021 జనవరిలో కూల్చారు. ఏడాదికల్లా కొత్త మార్కెట్ నిర్మాణం చేస్తామని హామీ ఇచ్చారు. రూ.50.90 కోట్లతో చేపట్టిన నూతన మార్కెట్ నిర్మాణపనులు ఇంకా పునాది దశలోనే వున్నాయి.
- ప్రొద్దుటూరు ప్రజలకు శాశ్వత తాగునీటి ఎద్దడి తీర్చడానికి కుందూ - పెన్నా అనుసంధాన వరదకాలువ రూ.183 అంచనాతో టీడీపీ ప్రభుత్వం మంజూరు చేసింది. దాదాపు రూ.25 కోట్లమేర పని జరిగింది. వైసీపీ అధికారంలోకి వచ్చాక కుందూ పెన్నా పూర్తిచేస్తామని చెప్పి ఆ పథకాన్ని మూలవేశారు.
- దళితులకు ఇచ్చిన హామీల్లో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌భవనం నిర్మాణం చేస్తామని చెప్పి కనీసం స్థలం కేటాయించలేదు.

ప్రొద్దుటూరు, రాజుపాళెం మండలాల్లో ఇచ్చిన హామీలు

- మండలంలోని ఉప్పర పల్లె, సోములవారి పల్లె, సీతంపల్లె, అమృతనగర్‌లకు బస్సు సౌకర్యం కల్పిస్తామని చెప్పిన హామీ నెరవేర్చలేదు.
- నాగాయపల్లె, చెన్నమరాజుపల్లె, కామనూరు గ్రామాల్లోని సాగునీటి ఎత్తిపోతల పథకాలకు మరమ్మతులు చేయించి అందుబాటులోకి తెస్తానన్న హామీ నెరవేర్చలేదు.
- సోములవారి పల్లె పంచాయతీలోని ఎర్రగుంట్ల రోడ్డును, ప్రొద్దుటూరు రోడ్డును, చౌటపల్లె పంచాయతీలోని జమ్మలమడుగు రోడ్డును, కొత్తపల్లె పంచాయతీలోని కానపల్లె, మడూరు రోడ్లు, గోపవరం పంచాయతీలోని కొర్రపాడు రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయి. ఈ రోడ్లు విస్తరణ చేయలేదు.
- జగనన్నకాలనీల్లో ఇప్పటివరకు మెటల్‌రోడ్లు సైతం ఏర్పాటు కాలేదు. బొల్లవరం లేఅవుట్‌కు నీటి సౌకర్యం విద్యుత్ సౌకర్యం ఏర్పాటు కాలేదు. దీంతో అక్కడ ఇచ్చిన సెంటు స్థలాల్లో ఇళ్ల నిర్మాణానికి లబ్ధిదారులు ముందుకు రావడంలేదు.
- రాజుపాళెం మండలం కొర్రపాడులో తాగునీటి సమస్య ఉంది. ఈ సమస్యను పరిష్కరిస్తామని చెప్పి ఒక్కరూపాయి నిధులు కేటాంచలేదు.
- వాసుదేవపురానికి బస్సు సౌకర్యం ఏర్పాటు చేస్తామని చెప్పారు. నేటికి వేయలేదు.



అమృతనగర్‌లో నీటి సమస్యను పరిష్కరించమని దండాలు పెడుతున్న మహిళలు

కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలని ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం (ఫైల్)



తొలి హామీ హుళక్కే..

- మాట తప్పి.. మడమ తిప్పిన జగన్
- విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు క్రమబద్ధీకరణకు నోచుకోని వైనం
- ఎన్నికల్లో సత్తా చూపుతామంటున్న కార్మికులు



ఎర్రగుంట్ల, ఏప్రిల్ 21: మాట ఇస్తే... మడమ తిప్పను అనేది జగన్ నినాదం. అయితే ఇచ్చిన తొలిహామీ విషయంలోనే జగన్ మడమ తిప్పాడని తేలిపోయింది. ఎలాంటి షరతు ల్లేకుండా విద్యుత్ ఏపీ జెన్‌కో, ట్రాన్స్‌కో, డిస్కంలలో పనిచేసే కాంట్రాక్టు కార్మికులందరినీ అధికారంలోకి రాగానే ఒక పద్ధతి ప్రకారం రెగ్యులర్ చేస్తానని ప్రజా సంకల్పయాత్రలో భాగంగా ఎర్ర గుంట్ల సభలో తొలిహామీ ఇచ్చాడు. ఇచ్చిన హామీని అమలు చేయకుండా తుంగలో తొక్కాడు. ఒకటి కాదు.. రెండు కాదు సుమారు 25వేల మంది కాంట్రాక్టు కార్మికులు రెగ్యులర్ చేస్తారని గంపెడాశతో ఎదురు చూశారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఆ ఊసే ఎత్తకపోవడంతో కార్మికులు మండిమడి తున్నారు. ఒక్క చాన్స్ అంటూ... అధికా రంలోకి వచ్చిన జగన్ తమకు తీవ్ర అన్యాయం చేశారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజా సంకల్పయాత్రలో..

ప్రతిపక్ష నాయకుడిగా వైఎస్ జగన్ 2017 నవంబర్ 6న ఇడుపులపాయలో ప్రజా సంకల్పయాత్ర ప్రారంభించాడు. జమ్మలమడుగు నియోజకవర్గంలోని ఎర్రగుంట్లకు నవంబరు 9న చేరుకున్నాడు. అదే రోజు సాయంత్రం నాలుగురోడ్ల కూడలిలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగసభలో ఆయన ప్రసంగిస్తూ.. ఈ పక్కనే ఉన్న ఏపీ జెన్‌కోకు చెందిన ఆర్టీపీపీలో, ఇతర విద్యుత్ సంస్థలైన ఏపీ ట్రాన్స్‌కోలో వేలాది మంది కాంట్రాక్టు కార్మికులుగా పని చేస్తున్నారని.. వారిని చంద్రబాబు రెగ్యులర్ చేస్తామని మోసం చేశాడని విమర్శించారు. 2019లో తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వీరందరికి ఒక క్రమ పద్ధతి ప్రకారం రెగ్యులర్ చేస్తామని వేలాది మంది జనం సాక్షిగా తొలిహామీ ఇచ్చారు. ఆ ఎన్నికల్లో జగన్ భారీ మెజార్టీతో వైసీపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. కానీ కాంట్రాక్టు కార్మికులకు ఇచ్చిన తొలిహామీని మాత్రం మరిచి మాట తప్పాడు.

వైసీపీకి ఓట్లేసే ప్రసక్తే లేదు...

2019లో వైఎస్ జగన్ రెగ్యులర్ చేస్తామని ఇచ్చిన హామీని నమ్మి తామంతా గంపగుత్తగా ఓట్లు వేశాం.. ఇచ్చిన మాట తప్పాడు.. కాబట్టే వైసీపీకి ఓట్లేసే ప్రసక్తేలేదని కార్మికులు తెగేసి చెబుతున్నారు. కనీసం జీతాలైనా బోర్డు ద్వారా నేరుగా ఇవ్వాలని వేడుకున్నా.. తమ గోడును వినేందుకు కూడా జగన్ ఇష్టపడకుండా తూతూ మంత్రంగా జీతాలు పెంచి మోసం చేశాడని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పైగా అధికారంలోకి వచ్చి రాగానే ఆర్టీపీ పీని మూసివేస్తామని, ప్రైవేటుపరం చేస్తామని అభద్ర తాభావం కల్పించారన్నారు. ఆసియాలోనే మంచి ప్లాంటుగా గుర్తింపు పొందిన ఆర్టీపీపీలో ఆరు నెలలపాటు విద్యు దుత్పత్తిని నిలిపివేసిన ఘనత కూడా జగన్‌కే దక్కుతుందని ఉద్యోగ, కార్మికులు విమర్శి స్తున్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో తమ సత్తా ఎంటో చూపుతామని రాష్ట్ర వ్యాప్తంగా పనిచేసే విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు చెబుతున్నారు.



రాములోరి లగ్నం.. వేదిక సిద్ధం

● నేడు అంగరంగ వైభవంగా సీతారాముల కల్యాణం

రాజంపేట/ఒంటిమిట్ట, ఏప్రిల్ 21 : ఆంధ్రాభద్రాద్రి ఒంటిమిట్ట కోదండరాముడి కల్యాణోత్సవం సోమవారం రాత్రి అంగరంగ వైభవంగా జరగనుంది. గతంలో లాగా రాత్రి 8 గంటలకు కాకుండా ఈ ఏడాది సాయంత్రం 6.30 గంటల నుంచి 8.30 గంటల మధ్య కల్యాణాన్ని నిర్వహించడానికి తిరుమల తిరుపతి దేవస్థానం నిర్ణయించింది. ఒంటిమిట్ట కోదండరామాలయ కల్యాణోత్సవానికి దేశంలోనే విభిన్న నేపథ్యం ఉంది. అన్నిచోట్లా పగటి పూట కల్యాణం నిర్వహిస్తే ఇక్కడ మాత్రం నెల రాజు నిండు పున్నమి వెన్నెల్లో రాత్రివేళ కల్యాణం జరపడం ఓ ప్రత్యేకత. శ్రీరాముడు చైత్రశుద్ధ నవమి నాడు పునర్వసు నక్షత్రంలో జన్మించాడు. అందువల్ల ఆయన పరిణయ మహోత్సవాలు అయోధ్యలోనైనా.. భద్రాద్రిలోనైనా.. దేశవ్యాప్తంగా ఏ ఇతర ప్రసిద్ధ రామాలయ క్షేత్రాలలోనైనా నవమినాడే అభిజిత్ లగ్నంలో పగటిపూట మాత్రమే జరపడం ఆనవాయితీ. అయితే అందుకు భిన్నంగా అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు శ్రీరామచంద్రుడు, మహాలక్ష్మి స్వరూపిణి సీతమ్మను పరిణయమాడే మహత్తర ఉత్సవం చైత్రశుద్ధ పౌర్ణమి నాటి రాత్రి వేళ నిర్వహించడం ఏకశిలా నగరి ఒంటిమిట్టకు మాత్రమే ప్రత్యేకత.

కల్యాణ వేదిక సిద్ధం

సీతారాముల కల్యాణానికి కళ్యాణ వేదికను సర్వాంగ సుందరంగా అలంకరించారు. భక్తుల సౌకర్యార్థం జిల్లా యంత్రాంగం సమన్వయంతో అన్నప్రసాదాలు, తాగు నీరు, విద్యుత్, పుష్ప, అలంకరణలు, భద్రత, సౌండ్ సిస్టమ్, ఎల్ఈడీ టీవీలను టీటీడీ ఏర్పాటు చేసింది. టీటీడీ నిఘా, భద్రత విభాగం జిల్లా పోలీసు యంత్రాంగంతో సమన్వయం చేసుకుని పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేసింది. అదే విధంగా వేదిక వద్ద బారికేడ్లు, రోప్‌లు, మెగా ఫ్యాన్లు కూడా టీటీడీ ఏర్పాటు చేసింది. భక్తులకు వేసవి ఉపశమనం కోసం 200కి పైగా ఎయిర్ కూలర్‌లు ఏర్పాటు చేశారు. కల్యాణ వేదికను 30 వేల కట్‌ఫ్లవర్‌లతో సహా నాలుగు టన్నుల సంప్రదాయ పుష్పాలతో తెలుగుదనం ఉట్టిపడేలా అలంకరిస్తున్నారు. దాదాపు 100 మంది నిపుణులు రెండు రోజులుగా పుష్పాలంకరణలు చేస్తున్నారు. కల్యాణానికి విచ్చేసే ప్రతి భక్తుడికి గ్యాలరీలలోనే తలంబ్రాలు, శ్రీవారి లడ్డూ ప్రసాదాలు పంపిణీ చేసేందుకు టీటీడీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది.

పటిష్ట భద్రతా ఏర్పాట్లు

సీతారాముల కల్యాణం సందర్భంగా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ పరిశీలించి పోలీసు అధికారులు, సిబ్బందికి భద్రతా ఏర్పాట్లపై దిశా నిర్దేశం చేశారు. సీతారాముల కల్యాణానికి పెద్దఎత్తున భక్తులు రానున్న నేపథ్యంలో పకడ్బందీ భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్‌ను నియంత్రించాలన్నారు. ఒంటిమిట్టలోని కోదండరామాలయం కల్యాణ వేదిక, పార్కింగ్ ప్రదేశాలను పరిశీలించి చేపట్టాల్సిన భద్రతా చర్యలపై పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్పీ వెంకటరాముడు, ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్ఎస్ఎస్‌వి కృష్ణారావు, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ బి.రాజు, ఒంటిమిట్ట సీఐ పురుషోత్తం రాజు, ఎస్ఐ మధుసూదన్‌రావు, సిద్దవటం ఎస్ఐ పెద్ద ఓబన్న తదితరులు పాల్గొన్నారు.

కల్యాణోత్సవానికి కోటి తలంబ్రాలు

శ్రీరాముని కల్యాణానికి శ్రీచైతన్య సంఘం కోరుకొండ తూర్పు గోదావరి జిల్లా వారు ప్రతిఏటా శ్రీరామచంద్రునికి గోటితో చేసిన కోటి తలంబ్రాలు పంపించడం ఆనవాయితీగా కొనసాగుతోంది. ఆదివారం తూర్పు గోదావరి జిల్లా కోరుకొండ నుంచి అప్పారావు నేతృత్వంలో తీసుకువచ్చిన తలంబ్రాలకు టీటీడీ అర్చకులు శ్రావణ్ కుమార్, వీణారాఘవాచార్యులు రామాలయం ఎదురుగా ఉంచి ప్రత్యేక పూజలు చేశారు.

మోహినీ అలంకారంలో జగన్మోహనుడు


కోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదవ రోజు ఆదివారం ఉదయం మోహినీ అలంకారంలో రాములవారు జగన్మోహనకారుడిగా దర్శనమిచ్చారు. ఉదయం స్వామి వారి ఊరేగింపు వైభవంగా ప్రారంభమైంది. కేరళ డ్రమ్స్, భక్తజన బృందాలు, చెక్క భజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తుండగా మంగళవాయిద్యాల నడుమ స్వామి వారి ఊరేగింపు కోలాహలంగా జరిగింది.

గరుడవాహనంపై కోదండరాముడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదవ రోజు రాత్రి గరుడ వాహనంపై సీతారామలక్ష్మణులు భక్తులకు అభయమిచ్చారు. రాత్రి వాహన సేవ వైభవంగా నిర్వహించారు. భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పించి స్వామి వారిని దర్శించుకున్నారు.

బి-ఫారాలు అందజేత

కడప, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కడప పార్లమెంట్, అసెంబ్లీలకు పోటీచేస్తున్న అభ్యర్థులకు ఆదివారం చంద్రబాబునాయుడు మంగళగిరిలో బి-ఫారాలు అందించారు. పార్లమెంట్ అభ్యర్థి భూపేష్‌రెడ్డి, ప్రొద్దుటూరు వరదరాజులరెడ్డి, పులివెందుల బీటెక్ రవి, మైదుకూరు పుట్టా సుధాకర్ యాదవ్, కమలాపురం పుత్తా చైతన్యరెడ్డిలకు బి-ఫాం అందించారు. ఎన్నికల్లో ప్రచారంపై చంద్రబాబు జిల్లా నేతలకు సూచనలిచ్చారు.



కడప పార్లమెంట్, అసెంబ్లీ అభ్యర్థులకు బి-ఫాం అందించిన చంద్రబాబునాయుడు

వైసీపీలో కలవరం

● పీసీసీ చీఫ్ షర్మిల సభ సక్సెస్ ● మైనార్టీ ఓట్లకు గండి పడుతుందని అలజడి

● ప్రచారం, పార్టీ చేరికలతో దూసుకెళ్తున్న సైకిల్



కడప (ఆంధ్రజ్యోతి): కడపలో వైసీపీకి ఈసారి ఎదురుగాలి తగులుతుందా... డిప్యూటీ సీఎం అంజాద్‌బాషాకు విజయం వన్‌సైడ్ కాదని తేలిపోయిందా... అవుననే వైసీపీ వర్గా లు అంటున్నాయి. 2014, 2019 ఎన్నికల్లో అంజాద్‌బాష ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. డిప్యూ టీ సీఎంగా బాధ్యతలు చేపట్టారు. ఈసారి కూడా హ్యాట్రిక్ అని ఆరు నెల ల క్రితం వరకు భావించేవారు. అయితే ఒక్కసారిగా పరిస్థితులు మారిపోతున్నాయి. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి భార్య మాధవిని ఎమ్మెల్యే అభ్యర్థిగా నిలబెట్టింది. ఆమె ప్రచారంలో దూసుకుపోతోంది. ఇంటింటికి తిరిగేసి జనంతో మమేకమవుతూ వైసీపీకి చెమటలు పట్టిస్తోంది. అయితే ముస్లిం మైనార్టీ, క్రిస్టియన్, రెడ్డి సామాజిక ఓట్లు గంపగుత్తగా పడతాయని వైసీపీ నాయకులు భావిస్తూ వచ్చారు. ముఖ్యంగా ముస్లిం ఓట్లపై గంపెడాశ పెట్టుకున్నారు. అయితే పీసీసీ చీఫ్‌గా వైఎస్ షర్మిల బాధ్యతలు చేపట్టడంతో కనుమరుగవుతుందనుకున్న కాంగ్రెస్ మళ్లీ జీవం పోసుకుంటోంది. శనివారం షర్మిల నామినేషన్ సందర్భంగా నిర్వహించిన ర్యాలీ, బహిరంగ సభకు జనం భారీగా పోటెత్తారు. ముఖ్యంగా మహిళలు అత్యధికంగా వచ్చారు. ఎండ తీవ్రంగా ఉన్నప్పటికి చుట్టుపక్కల చెట్ల కింద నిల్చుని ప్రసంగాన్ని ఆసక్తిగా విన్నారు. వైసీపీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన అఫ్జల్‌ఖాన్‌ను కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో దింపింది. మైనార్టీల్లో ఒక వర్గంలో అఫ్జల్‌ఖాన్‌కు మంచి పట్టు ఉందంటారు. 2009లోనే పీఆర్పీ తరపున పోటీ చేయగా సుమారు 17వేల ఓట్లు సంపాదించుకున్నారు. అయితే ఇపుడు కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తుండడంతో మైనార్టీ ఓట్లకు గండిపడుతుందేమో అని వైసీపీలో కలవరం పుడుతోంది.

సాంప్రదాయ ఓటర్లు కాంగ్రెస్‌కు వెళితే...

మైనార్టీలు, క్రిస్టియన్‌లు వైసీపీకి సాంప్రదాయ ఓటర్లు. రాష్ట్ర విభజన తర్వాత కాంగ్రెస్ పార్టీ కనుమరుగయ్యే పరిస్థితికి వచ్చింది. అపుడు ఆ ఓట్లన్నీ వైసీపీకి వెళ్లాయి. ఇపుడు మళ్లీ కాంగ్రెస్ పుంజుకోవడంతో ఆ ఓట్లు కాంగ్రెస్‌లోకి మల్లుతాయని వైసీపీకి కలవరపాటుకు గురవుతోంది. కడప అసెంబ్లీలో మొత్తం ఓట్లు 2,79,838 ఉన్నాయి. ముస్లిం, క్రిస్టియన్ సాంప్రదాయ ఓటర్లు కాంగ్రెస్‌కు వెళితే మా పనైపోతుందని వైసీపీ నేతలు ఆందోళన చెందుతున్నారు.

దూసుకుపోతున్న టీడీపీ

కడప టీడీపీ అభ్యర్థి మాధవిరెడ్డి కడపలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. గత ఏడు నెలలుగా నిర్విరామంగా ఉదయం, సాయంత్రం కడపను చుట్టేస్తున్నారు. వైసీపీ శ్రేణులను టీడీపీలోకి జాయిన్ చేసుకుంటూ దూసుకెళ్తున్నారు. రెండు రోజుల క్రితం మేయర్ సురేష్ బాబు బంధువులను టీడీపీలో చేర్చుకున్నారు. సురేష్‌బాబు బంధువులు టీడీపీ తీర్థం పుచ్చుకోవడం వైసీపీకి చిన్నచౌక్‌లో పెద్దదెబ్బేనని అంటున్నారు. టీడీపీ టికెట్‌ను లక్ష్మిరెడ్డి ఆయన కోడలు ఉమాదేవికి ఆశించారు. టికెట్ దక్కకపోవడంతో కొద్ది రోజులుగా దూరంగా ఉంటున్నారు. అయితే లక్ష్మిరెడ్డి వర్గం కూడా ప్రచారంలో పాల్గొనే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి అఫ్జల్‌ఖాన్ కూడా బలంగా ప్రతి ఇంటికి వెళ్లాలని నిర్ణయించుకున్నారు. ఒకపక్క టీడీపీ, మరోపక్క కాంగ్రెస్ హోరాహోరీగా ప్రచారం నిర్వహిస్తుండడంతో వైసీపీని కలవరానికి గురిచేస్తోంది.

ఎన్నికల ప్రచారంలో ఉపాధి సిబ్బంది

● జిల్లా ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేసిన టీడీపీ నేతలు



గొర్లముదివేడులో ఎన్నికల ప్రచారంలో ఫీల్డ్ అసిస్టెంట్ రవీంద్రారెడ్డి

రాయచోటిటౌన్, ఏప్రిల్ 21: జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, వలంటీర్లు స్వామి భక్తిని చాటుకుంటూ వైసీపీ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. ఎన్నికల నిబంధనలను తుంగలో తొక్కుతూ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారంలో జోరుగా తిరుగుతున్నారు. ఈ క్రమంలోనే రాయచోటి నియోజకవర్గ వ్యాప్తంగా పలు మండలాలకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్లు ఎన్నికల ప్రచారంలో వైసీపీ నాయకుల వెంట తిరుగుతూ అధికార పార్టీకి అంటకాగుతున్నారు. వారిలో ప్రధానంగా లక్కిరెడ్డిపల్లె మండలం కుర్నూతల ఫీల్డ్ అసిస్టెంట్ జగన్‌మోహన్‌రెడ్డి, లక్కిరెడ్డిపల్లె ఫీల్డ్ అసిస్టెంట్ బాబ్జి, సంబేపల్లె మండలం శెట్టిపల్లె ఫీల్డ్ అసిస్టెంట్ సుమన్, రాయచోటి మండలం గొర్లముదివేడు, ఫీల్డ్ అసిస్టెంట్ రవీంద్రారెడ్డిలు ఎన్నికల ప్రచారంలో పాల్గొంటూ అధికార పార్టీ తరపున ప్రచారం చేస్తున్నారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్న ఆ నలుగురు ఫీల్డ్ అసిస్టెంట్లపై శనివారం టీడీపీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అభిషిక్త్ కిశోర్‌కు రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొంటూ ఉపాధి కూలీలను ప్రభావితం చేసే ఫీల్డ్ అసిస్టెంట్‌లపై ఎన్నికల నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆయన ఫిర్యాదులో జిల్లా ఎన్నికల అధికారిని కోరారు.



సంబేపల్లె మండలంలో ఎన్నికల ప్రచారంలో శెట్టిపల్లె ఫీల్డ్‌అసిస్టెంట్ సుమన్



లక్కిరెడ్డిపల్లెలో ప్రచారంలో ఫీల్డ్ అసిస్టెంట్ బాబ్జీ, కుర్నూతల ఫీల్డ్ అసిస్టెంట్ జగన్‌మోహన్‌రెడ్డి

పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయండి

● జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి అభిషిక్త్ కిశోర్

రాయచోటిటౌన్, ఏప్రిల్ 21: పోలింగ్ అనంతరం ఈవీఎంలను స్ట్రాంగ్ రూములలో భద్రపరిచేందుకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిశోర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆదివారం ఆయన రాయచోటి పట్టణంలోని సాయి ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లను ఎస్పీ కృష్ణారావు, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, జిల్లా అదనపు ఎస్పీ డాక్టర్ వీబీ రాజ్‌కమల్, డీఆర్‌వో సత్యనారాయణ, ఆర్డీవో రంగస్వామిలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిబంధనల మేరకు కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లలో చేపట్టాల్సిన ఏర్పాట్లపై దృష్టి సారించి త్వరితగతిన పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో టేబుళ్ల ఏర్పాటు, రాజకీయ పార్టీల ఏజెంట్లు కూర్చునేందుకు చుట్టూ బారికేడింగ్, అభ్యర్థులు, ఏజెంట్లు వచ్చి వెళ్లేందుకు ప్రత్యేక దారి, రిసెప్షన్ సెంటర్ తదితర ఏర్పాట్లు ఈసీ సూచించిన నిబంధనల మేరకు ప్రణాళికాబద్ధంగా ఉండాలన్నారు. కౌంటింగ్ కేంద్రాల్లో ఎలాంటి లోటు పాట్లు లేకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఎస్పీ కృష్ణారావు మాట్లాడుతూ స్ట్రాంగ్ రూముల దగ్గర కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తుతో నిరంతర నిఘా ఏర్పాటు చేసి ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ సరళి పూర్తి చేసేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎన్నికల నిర్వహణ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ కేంద్రాల గదులను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ తదితరులు

కనుమరుగవుతున్న నల్లబంగారం

● గ్రామాల్లో అంతరించిపోతున్న చెరకు సాగు
● విక్రయాలపై ప్రభుత్వం ఆంక్షలు
● ఆశ కొద్దీ పండించినా భారీగా నష్టపోతున్న రైతులు





క్రసర్‌లో చెరకులు పెడుతున్న కూలీలు

బి.కొత్తకోట, ఏప్రిల్ 21: ఏడాదికోసారి పెద్ద మొత్తంలో నగదు చేతికందించి రైతు కుటుంబాలకు ఆసరాగా నిలిచిన చెరకుసాగు క్రమేపీ కనుమరుగైపోతోంది. గతంలో గ్రామాలలో వేసవి వస్తే చెరకుగడులు, ఉడుకుబెల్లం, నక్కీలుబంక అంటూ పిల్లా, జల్లా గానుగిండ్ల వైపు ఎగబడేవారు. రైతులు చేసే అప్పులు సైతం పంటమీద ఇస్తాం... అని చెప్పేవారు. చెరకు తోటలకు ప్రసిద్ధి చెందిన పలు గ్రామాల్లో చెరకు రైతుల ఇళ్లలో వందల గోనుల నల్లబెల్లం నిల్వ వుండేది. ఇంటికొచ్చిన బంధువులకు బెల్లం కాఫీ, బెల్లం వంటకాలు చేసిపెట్టి, వెంటకూడా ఇచ్చి పంపేవారు... ఇదంతా గతం.

ప్రస్తుతం చెరకుతోటలు ఏ గ్రామంలో వున్నాయో అని వెతకాల్సి వస్తోంది. ఇప్పటి పిల్లల్ని తీసుకెళ్లి నల్లబెల్లం తయారు చేసే విధానం ఇదీ అని చూపించాల్సి వస్తోందంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ చెరకు సాగు భారీగా తగ్గిపోవడానికి పలు కారణాలు ఉన్నాయి.

ఫలసాయం అమ్ముకోలేని దుస్థితి

ధరల హెచ్చుతగ్గులు ఎలా వున్నా మిగతా పంటల లాగా చెరకు ఫలసాయాన్ని రైతులు అమ్ముకోలేని దుస్థితి రావడమే ప్రధాన సమస్యగా చెప్పవచ్చు. గతంలో ప్రభుత్వమే సారా తయారీ కోసం నల్లబెల్లం కొనుగోలు చేసేది. వ్యాపారులు పల్లెలలో కొనుగోలు చేసి డిమాండును బట్టి ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసేవారు. సంతలలో అమ్ముకున్నా, దుకాణాలలో నిల్వవుంచి అమ్ముకున్నా సమస్య వుండేది కాదు. ఇప్పుడు అలా కాదు. నల్లబెల్లాన్ని ప్రభుత్వం కొనదు, వ్యాపారులు తరలించరాదు, నిల్వ ఉంచరాదంటూ ప్రభుత్వం ఆంక్షలు విధించింది. దీనికి సంబంధించి కేసులు కూడా నమోదైన సందర్భాలున్నాయి. దీంతో చేసేది లేక క్రమేపీ చెరకుసాగును రైతులు తగ్గిస్తున్నారు.

భారీగా తగ్గిపోయిన సాగు విస్తీర్ణం

జిల్లాలోని పడమటి మండలాలైన పీటీఎం, బి.కొత్తకోట, ములకలచెరువు, తంబళ్లపల్లె, పెద్దమండ్యం తదితర ప్రాంతాల్లో వేల ఎకరాల్లో వుండే చెరకుసాగు నేడు నామమాత్రంగా మారి కనుచూపు మేరలో లేకుండా పోయింది. నల్లబెల్లం విక్రయాలపై ఆంక్షలు ఉండటంతో గానుగలు ఆడి నల్లబెల్లం తయారీని ఆపి, పుంగనూరులో ప్రారంభమైన వాణీ షుగర్స్ ఫ్యాక్టరీ యాజమాన్యంతో ఒప్పందం కుదుర్చుకుని రైతులు చెరకును నేరుగా ఫ్యాక్టరీకి తరలించేవారు. కొన్నేళ్లు ఈ చెరకు ఎగుమతి కొనసాగడంతో రైతులకు ఎంతోకొంత గిట్టుబాటు అయ్యేది. కారణం ఏదైనా యాజమాన్యం ఆ ఫ్యాక్టరీని మూసేసింది. దీంతో చెరకు కొనేవారు లేరు... నల్లబెల్లం ఆడకూడదు. ఇక చెరకు సాగు ఎందుకంటూ రైతులు మానేయాల్సిన దుస్థితి నెలకొంది.

ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి..

ప్రభుత్వ నిబంధనల వల్ల మేము బాగా నష్టపోతున్నాం. లాభసాటిగా లేకున్నా పంటమీద ఇష్టంతో మొండిగా సాగుచేస్తున్నాం. కొనే వ్యాపారులు ఉన్నా భయంతో కొందరు ముందుకు రావడం లేదు. గుట్టుగా కొనేవారు ఈ సాకు చూపి తక్కువ రేటుకు అడుగుతారు. చూసి చూసి ఆ రేటుకు విక్రయించలేము. అలా అని ఇంట్లో పెట్టుకోలేము. ఇప్పుడు ఒక బెల్లంముద్ద ధర అంగట్లో రూ. 110-130 వరకు వుంది. మా దగ్గర మాత్రం రూ. 70-80కే అడుగుతారు. ఈ బాధలు పడలేక చెరకు తోటలు సాగు చేయడం లేదు. ప్రభుత్వం ఆదుకుంటే సాగు చేసేందుకు మక్కువ చూపుతాం.



- శ్రీనాథ్‌రెడ్డి, చెరుకురైతు, శీతోళ్లపల్లె, బి.కొత్తకోట

నష్టపోతున్న రైతులు

చెరకు పంటపై మక్కువతో అరకొరగా సాగుచేస్తున్న రైతులు సైతం సరైన దిగుబడి లేక, ఉన్న దాన్ని అమ్ముకోలేక భారీగా నష్టపోతున్నారు. ప్రస్తుతం ఎటువంటి రసాయనిక పదార్థాలు లేని గ్రామీణ తయారీ నల్లబెల్లానికి డిమాండ్ వున్నప్పటికీ బహిరంగ మార్కెట్ లేకపోవడంతో రైతులు భారీగా నష్టపోతున్నారు. 11 నెలల పాటు కాపుకాచి పంట పండించి, రాత్రింబవళ్లు కష్టపడి బెల్లం తయారీ చేస్తే నష్టాలు తప్పడం లేదని చెరకు రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం ఆంక్షలు సడలిస్తే బెల్లం క్రయ, విక్రయాలు పెరిగి చెరకుసాగు వైపు రైతులు మళ్లే అవకాశం వుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.



చెరకు పాలను బెల్లంవంట కోసం వేడి చేస్తున్న దృశ్యం



దోనిలో బెల్లం తయారు చేస్తున్న దృశ్యం

కల్యాణానికి ఏర్పాట్లు సిద్ధం : కలెక్టర్

కడప(కలెక్టరేట్)/క్రైం, ఏప్రిల్ 21: ఒంటిమిట్ట కోదండరాముడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించే కల్యాణోత్సవానికి వెళ్లే భక్తుల సౌకర్యార్థం జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసిందని కలెక్టర్ విజయరామరాజు తెలిపారు. టీటీడీ అధికారుల సమన్వయంతో జిల్లా యంత్రాంగం ఆరోగ్య భద్రతా చర్యలను చేపడుతోందని, ప్రతి ఒక్కరూ స్వీయ పరిశుభ్రత, ఆరోగ్య సూత్రాలు పాటించాలన్నారు. కాగా బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు సంబంధించి అన్ని ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్ గణేశ్‌కుమార్, కడప నగర కమిషనర్ ప్రవీణ్‌చంద్‌ల పర్యవేక్షణలో పూర్తి చేశారన్నారు. బ్రహ్మోత్సవాలకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం 100 ప్రత్యేక బస్సులను పలు ముఖ్య ప్రదేశాల నుంచి రూట్ల వారీగా కేటాయించినట్లు ఏపీఎస్ ఆర్టీసీ రవాణా అధికారి గోపాలరెడ్డి తెలియజేశారు. కడప డిపో నుంచి 35, పులివెందుల నుంచి 10, బద్వేలు నుంచి 20, జమ్మలమడుగు నుంచి 10, మైదుకూరు నుంచి 5, ప్రొద్దుటూరు నుంచి 20, ఇతర రీజియన్ డిపోల నుంచి 40, రాజంపేట నుంచి 30, రాయచోటి నుంచి 10 బస్సులు ఏర్పాటు చేశామని తెలిపారు.

వాహనాల దారి మళ్లింపు

సీతారాముల కల్యాణోత్సవం నేపథ్యంలో ప్రయాణీకులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్ మళ్లించినట్లు ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ తెలిపారు. 22వ తేదీ మధ్యాహ్నం 2 గంటల నుంచి అమలులో ఉంటుందని, భక్తుల వాహనాలు తప్ప ఇతర వాహనాలకు అనుమతి లేదన్నారు. కడప నుంచి తిరుపతికి వైపు వెళ్లే వాహనాలు కడప ఆలంఖన్‌పల్లి ఇర్కాన్ సర్కిల్ నుంచి ఊటుకూరు సర్కిల్ రాయచోటి మీదుగా తిరుపతికి వెళతాయి. తిరుపతి నుంచి కడప వైపు వచ్చే భారీ వాహనాలు రేణిగుంట నుంచి రాయచోటి మీదుగా కడపకు చేరుకుంటాయి. అలాగే రైల్వేకోడూరు, రాజంపేట నుంచి వచ్చే వాహనాలు కూడా రాయచోటి మీదుగా కడపకు చేరుకుంటాయి. రాజంపేట నుంచి వచ్చే ద్విచక్ర వాహనాలు సాలాబాదు మీదుగా ఇబ్రహీంపేట మాధవరం మీదుగా కడపకు చెరుకునేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కాగా, రాజంపేట నుంచి వచ్చే ద్విచక్రవాహనాలకు సాలాబాద్ సమీపంలో 5 ప్రాంతాల్లో, కడప నుంచి వచ్చే వాహనాలు కల్యాణ వేదికకు సమీపంలో 10 చోట్ల పార్కింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

అధికార పార్టీ నాయకులకే
కల్యాణోత్సవం పాసులు

ఒంటిమిట్ట, ఏప్రిల్ 21: ఒంటిమిట్ట కోదండరాముడి కల్యాణోత్సవానికి జిల్లా యంత్రాంగం వీఐపీ, వీవీఐపీ పాసులను ముద్రించింది. వీఐపీ పాసులు ఎన్ని ముద్రించారు అన్నది గోప్యంగా ఉంచడం అనుమానాలకు తావిస్తోంది. వీఐపీ కేటగిరీలో ప్రెస్ గ్యాలరీ, వీఐపీ గ్యాలరీ, వీవీఐపీ గ్యాలరీలన్నీ విభజించి కల్యాణోత్సవం రోజున ప్రోటోకాల్ ప్రకారం పంపిణీ చేయడం ఆనవాయితీ. ఎలక్షన్‌కోడ్ నేపథ్యంలో ప్రోటోకాల్ పక్కన పెట్టి జిల్లా యంత్రాంగం అధికార పక్షం చెప్పిన వారికి పాసులు ఇవ్వడం విమర్శలకు తావిస్తోంది. జిల్లా పరిషత్, కలెక్టరేట్‌లో పనిచేసే ఉన్నత స్థాయి అధికారుల ద్వారా అధికార పార్టీ నాయకులకు పెద్దఎత్తున పాసులను తరలించినట్లు సమాచారం. ఎలక్షన్ కోడ్ ఉన్నదని ప్రచారం చేస్తూనే, అధికారపార్టీకి అనుకూలంగా కింది స్థాయి అధికారులు పాసులు పంపిణీ చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రతి ఏటా బ్రహ్మోత్సవాల్లో మీడియా ప్రతి నిధులకు ప్రత్యేకంగా పాసులు మంజూరు చేసే అధికారులు ఈ ఏడాది అధికార పార్టీకి చెందిన పత్రికకు, తమకు నచ్చిన వారికి మాత్రమే పాసులు ఇవ్వడంతో సమాచార శాఖ అధికారులపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. స్థానిక విలేకర్ల పేరు చెప్పుకొని బయటి వ్యక్తులకు పాసులు ఇవ్వడంపై స్థానికంగా ఉన్న మీడియా ప్రతినిధులు స్థానిక అధికారులను ప్రశ్నించారు.

వ్యక్తిపై ఆగంతకుల దాడి

బద్వేల్‌రూరల్, ఏప్రిల్ 21: మండల పరిధిలోని కొంగలబీడ్ సమీపంలో చెరువుకట్టపై మోటారు బైకుపై వస్తున్న ఓ వ్యక్తిని ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి జేబులో ఉన్న సెల్‌ఫోన్ లాక్కెళ్లినట్లు బాధితుడు రూరల్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ రవికుమార్ వివరాల మేరకు.. స్థానిక సిద్దవటంలో ఉన్న రాధాకృష్ణారెడ్డి కోనసముద్రం గ్రామంలో ఉన్న బంధువుల ఇంటి వద్దకు వెళ్లి తిరిగి వచ్చే సమయంలో కొంగలబీడ్ చెరువు కట్టవద్దకు రాగానే ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు మోటారు బైకును ఆపి అతనిపై దాడి చేసి జేబులో ఉన్న సెల్‌ఫోన్‌ను లాక్కెళ్లారని తెలిపారు. ఆగంతకుల దాడిలో రాధాకృష్ణారెడ్డి నుదుటిపై గాయమైనట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఓటర్లకు చీరలు పంపిణీ

చిన్నమండెం, ఏప్రిల్ 21: మండలంలోని కొత్తపల్లి గ్రామ పంచాయతీలో అధికార పార్టీకి చెందిన ఒక గ్రామ స్థాయి నాయకుడు మహిళా ఓటర్లను ఇంటి వద్దకే పిలిపించుకొని చీరలు పంపిణీ చేశారు. ఆ నాయకుడు వచ్చిన మహిళా ఓటర్లకు అభివృద్ధి కార్యక్రమాలు కావాలంటే మళ్లీ వైసీపీకి ఓటు వేసి జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఒక్కో మహిళకు ఒక్కో చీర చొప్పున పంపిణీ చేశారు. వలంటీర్లను ఎన్నికల కమిషన్ ఎన్నికలకు దూరంగా ఉంచడంతో వలంటీర్ వ్యూహం ఫలించక ఓటమి భయంతో వైసీపీ నాయకులు ఇలా ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తున్నారని టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

బి.కోడూరు, ఏప్రిల్ 21: మండల పరిధిలోని బద్వేల్, పోరుమామిళ్ల మెయిన్ రోడ్డు ఐతరం గ్రామ సమీపాన పల్సర్ బైక్‌లో వెళుతున్న మహబూబ్‌బాషా అదుపు తప్పి కిందపడి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. బద్వేల్ పట్టణం శివానగర్‌కు చెందిన ఈయన మద్దిమాను గుర్రప్పస్వామి దగ్గరకు పోయి తిరిగి ఇంటికి వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ విషయమై బి.కోడూరు ఎస్ఐ జయరాములు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన మహబూబ్‌బాషా

ఎన్నికల ప్రచారంలో ఫైబర్ నెట్‌వర్క్ ఉద్యోగి

కమలాపురం(రూరల్), ఏప్రిల్ 21: మండల పరిధిలోని కొండాయపల్లె గ్రామానికి చెందిన గుండం మైసూరారెడ్డి ఏపీ ఫైబర్ నెట్‌వర్క్ సంస్థలో తాత్కాలిక ఉద్యోగిగా పనిచేస్తున్నారు. ఆది వారం కొండాయపల్లెలో కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి కుమార్తె రమ్యతారెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుండం మైసూరారెడ్డి పాల్గొన్నారు. ప్రభుత్వ జీతం తీసుకుంటూ ఇలా ఎన్నికల ప్రచారంలో పాల్గొనకూడదని, ఇది ఎన్నికల కోడ్ నిబంధనలకు విరుద్ధమని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. ఇతనిపై ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేయనున్నట్లు వారు తెలిపారు.



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఫైబర్ నెట్‌వర్క్ ఉద్యోగి

కలగా.. అప్సా జ్యూస్ పరిశ్రమ..!

● ఆందోళన చేసినా పునఃప్రారంభం ఊసేలేదు ● హామీ ఇచ్చి... చేతులు దులుపుకున్న వైసీపీ ప్రభుత్వం ● పాలకుల నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనం

రైల్వేకోడూరు, ఏప్రిల్ 21: రైల్వేకోడూరు ప్రాంతం పండ్ల తోటలకు ప్రసిద్ధి. ఇక్కడ మామిడి 20 వేల హెక్టార్లు, అరటి 18 వేల హెక్టార్లు, బొప్పాయి 20 వేల హెక్టార్లు, జామ 8 వేల హెక్టార్లు, సపోటా 2 వేల హెక్టార్లు, దానిమ్మ 4 వేల హెక్టార్లలో ఇక్కడి రైతులు పండిస్తున్నారు. పండ్లు అత్యధికంగా పండిస్తున్న ఈ ప్రాంతంలో అనంతరాజుపేట అప్సా జ్యూస్ ఫ్యాక్టరీ పునఃప్రారంభ వ్యవహారం ఎందుకనో ముందుకు సాగడం లేదు. ఎన్నికల హామీల్లో ప్రతిసారి నాయకులు పరిశ్రమ పునఃప్రారంభానికి కృషి చేస్తామని చెప్పినా పురోగతి సాధించలేదు. ఈ ఫ్యాక్టరీ కలగా మిగిలిపోతుందా అని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో అనంతరాజుపేట అప్సా జ్యూస్ ఫ్యాక్టరీలో తయారుచేసిన జ్యూస్‌లు, జామ్‌లు, కూల్‌డ్రింక్స్ తదితరవి దక్షిణ భారతదేశంలోనే భారీఎత్తున అమ్మకాలు చేశారు. ఎక్కువగా చిత్తూరు జిల్లాలో వ్యాపారం పుంజుకుంది. తయారుచేసిన జ్యూస్‌లు, కూల్‌డ్రింక్‌లు విపరీతంగా అమ్ముడుబోయాయి. గతంలో వీటికి పెద్ద డిమాండు ఉండేది. నాణ్యత ప్రమాణాలకు తక్కువగా లేకుండా చేసేవారు. విపరీతమైన రుచి, నాణ్యత అందించారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలో ఎక్కువగా అరటి, మామిడి, బొప్పాయి, జామ, సపోటా తదితర పండ్లను ఇక్కడి రైతులు పండిస్తున్నారని ఇక్కడ జ్యూస్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయాలని అప్పటి పాలకులు ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు.

రైల్వేకోడూరు మండలంలోని అనంతరాజుపేట గ్రామంలో జ్యూస్ ఫ్యాక్టరీని ప్రారంభించడానికి అక్కడి రైతులు అంగీకరించారు. కోట్లు విలువ చేసే 5 ఎకరాల స్థలాన్ని కూడా పంజం కుటుంబీకులు ఉచితంగా ఇచ్చారు. దీంతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ప్రభుత్వ ఆధీనంలోకి స్థలాన్ని తీసుకుని జ్యూస్ పరిశ్రమకు అనుమతి ఇచ్చారు. 1955లో డిపార్ట్‌మెంట్ ఆఫ్ అగ్రికల్చర్ ఆధ్వర్యంలో జ్యూస్ పరిశ్రమను స్థాపించారు. జ్యూస్ పరిశ్రమను అప్పటి దేశ ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ ప్రారంభించడంతో జాతీయ స్థాయి గుర్తింపు పొందింది. 1968లో ఏపీ ఆగ్రోస్ వారు జ్యూస్ పరిశ్రమను ఆధీనంలోకి తీసుకుని నడిపారు. రైతులు పండించే మామిడి తదితర పండ్లను తీసుకొచ్చి జ్యూస్ ఫ్యాక్టరీకి రైతులు సరఫరా చేసేవారు. కార్మికులు కాయలను మాగబెట్టి జ్యూస్, క్రష్, జామ్, పండ్ల రసాలు తయారు చేసేవారు. ఫ్యాక్టరీ యాజమాన్యం అనంతరాజుపేట వద్ద కూల్‌డ్రింక్స్ స్టాలు ఏర్పాటు చేశారు. ఎక్కువగా మహారాష్ట్ర, తమిళనాడు, కడప, రాజంపేట తదితర ప్రాంతాలవాసులు అప్సా కూల్‌డ్రింక్స్‌ను సేవించేవారు. తక్కువ ధరకు అమ్మకాలు చేసేవారు. చిత్తూరు, తిరుపతి, రైల్వేకోడూరు, రాజంపేట, కడపతో పాటు, చిత్తూరు, తమిళనాడు ప్రాంతాలకు అప్సాజ్యూస్‌లు వెళ్లేవి. దీంతో అమ్మకాలు ముమ్మరంగా జరిగాయి. పులివెందుల నుంచి చీని, కేరళ నుంచి పైనాపిల్, బెంగుళూరు నుంచి ద్రాక్ష, రైల్వేకోడూరు ప్రాంతం నుంచి అరటి, మామిడి కాయలు తీసుకుని జ్యూస్‌లు తయారు చేసేవారు. యాజమాన్యంలో ఉన్న లోపాలు, మార్కెటింగ్ పడిపోవడం, నష్టాలు రావడం తదితర కారణాలతో ఫాక్టరీ 1997లో మూతపడడంతో వెయ్యి మంది కార్మికులు వీధినపడ్డారు.

ఆ తర్వాత ఓ రాజకీయ నాయకుడు ఫ్యాక్టరీని లీజుకు తీసుకుని కొంతకాలం నడిపారు. అయితే ఆయన కూడా నష్టాలు చూడడంతో మరొకరికి ఇచ్చేశారు. వారుకూడా నడపలేకపోవడంతో మళ్లీ మూసేశారు. ఫ్యాక్టరీ మూతపడి అందులో ఉన్న యంత్రాలు కూడా తుప్పుపట్టాయి. ప్రస్తుతం ఏపీ ఆగ్రోస్ సంస్థ వారు అప్సా జ్యూస్ ఫ్యాక్టరీని తిరిగి ప్రారంభించాలని గత నాలుగేళ్ల కిందట రైతులతో ముఖాముఖి నిర్వహించారు. ఇక్కడి రైతులు అప్సా జ్యూస్ ఫ్యాక్టరీని ప్రారంభించాలని కోరారు. ఇందుకు ఏపీ ఆగ్రోస్ సంస్థవారు కూడా స్పందించారు. ఫ్యాక్టరీని ప్రారంభించాలంటే సుమారు రూ.7 కోట్లు కావాలని ప్రతిపాదనలు చేసినట్లు తెలిసింది. ఇందుకు ఏపీ ఆగ్రోస్ సంస్థవారు ఫ్యాక్టరీ ఆవరణాన్ని పరిశుభ్రంగా చేయడంతో పాటు చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రాజెక్టు నివేదికలు ప్రభుత్వానికి పంపే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. ఎక్కువగా చిత్తూరు జిల్లాలో జ్యూస్ ఫ్యాక్టరీలు ఉన్నాయి. దీంతో అక్కడున్న సౌకర్యాలు, అమ్మకాలు తదితరవాటిని పరిశీలిస్తున్నారు. గత మూడేళ్ల క్రితం రైల్వేకోడూరుకు చెందిన నాయకులు కొందరు ఏపీ రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ మధుసూధన్‌రావును కలిసి చర్చలు నిర్వహించారు. ఈయన కడప జిల్లా వాసి కావడంతో ఫ్యాక్టరీ పునఃప్రారంభం కావడానికి మార్గం సుగమం అవుతుందని ఇక్కడి రైతులు ఆశించారు. కానీ అడుగు ముందుకు పడడం లేదు. జనసేన, సీఐటీయూ తదితర పార్టీలు నాయకులు పరిశ్రమను పునఃప్రారంభించాలని ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. కొత్త ప్రభుత్వం అయినా జ్యూస్ పరిశ్రమను ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని ఇక్కడి రైతులు కోరుతున్నారు.



మూతపడిన అప్సా జ్యూస్ పరిశ్రమ ప్రధాన యూనిట్



పరిశ్రమను ప్రారంభించాలని ఆందోళన చేస్తున్న జనసేన నాయకులు (ఫైల్)

రోజుకు 1.5 లక్షల ప్రొడక్షన్ తీసేవాళ్లం

- శెట్టెప్ప, జ్యూస్ పరిశ్రమ మాజీ ఉద్యోగి



రోజుకు జ్యూస్ పరిశ్రమలో 1.5 లక్షల ప్రొడక్షన్ తీసేవాళ్లం. రైతుల దగ్గర కాయలు తీసుకుని మాగబెట్టి జ్యూస్‌లు, జామ్‌లు, చేసేవారు. అప్సా కూల్‌డ్రింక్స్‌కు మంచి డిమాండు ఉండేది. నష్టాలు వస్తున్నాయని పరిశ్రమను మూసివేశారు. బలవంతంగా వీఆర్‌ఎస్ ఇచ్చారు. అప్పట్లో 36 మందిని తీసివేయడంతో కార్మికులు, ఉద్యోగులు వీధిన పడ్డారు.

పరిశ్రమను స్థాపిస్తే రైతులకు మేలు

- క్రిష్ణారెడ్డి, అనంతరాజుపేట, అరటి రైతు



జ్యూస్ పరిశ్రమను స్థాపిస్తే రైతులకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది. గతంలో ఒకటో, రెండో పంటలు పండించేవారు. ప్రస్తుతం చాలా రకాల పండ్లు పండిస్తున్నారు. అందులోనూ సేంద్రియ వ్యవసాయంతో పంటలు సాగు చేస్తున్నారు. కాయలు నాణ్యత ప్రమాణాలతో ఉన్నాయి. ప్రజాప్రతినిధులు వెంటనే చర్యలు తీసుకుని ప్రారంభించాలి.



మామిడిచెట్లకు ట్యాంకర్ల ద్వారా నీరు అందిస్తున్న రైతు

డబ్బు పెట్టి నీటిని అందిస్తున్నాం



సురభి, గాజులపేట, కోమటిపేట, రెడ్డివారిపల్లె, బాలయ్యగారిపల్లె, అగ్రహారం ప్రాంతాల్లో భూ గర్భజలాలు అడుగంటాయి. మామిడి చెట్లు ఎండిపోతుండడంతో ట్యాంకర్ల ద్వారా నీళ్లు తోలుకుంటున్నాము. ఒక్కో ట్యాంకర్ రూ.500. రెండు మామిడిచెట్లు, నాలుగు నిమ్మ చెట్లకు నీరు సరిపోతోంది. చాలా ఇబ్బందులు పడుతున్నాం.

రమణమ్మ, పోలిశెట్టిపల్లె

ఎండిపోతుంటే చూడలేక



నాకు 200 మామిడిచెట్లు ఉన్నాయి. వర్షాభావం పరిస్థితుల కారణంగా నాకున్న రెండు బోర్లు పూర్తిగా ఎండిపోయాయి. కళ్లముందే చెట్లు ఎండిపోతుంటే చూడలేక ట్యాంకర్ల ద్వారా నీరు తోలుతున్నా. కానీ అది సాధ్యం కావడం లేదు. ప్రభుత్వం మా ఇబ్బందులను గుర్తించాలి.

నరసింహులు, సురభి

ఎటుచూసినా ఎండమావులే...

అడుగంటిన భూగర్భజలాలు ● ఎండిపోయిన బోర్లు, నెర్రెలుబారిన బావులు, చెరువులు
మామిడి, నిమ్మ రైతులకు తప్పని నీటి కష్టాలు ● ట్యాంకర్ల ద్వారా నీరు అందించాల్సిన దుస్థితి

చక్రాయపేట, ఏప్రిల్ 21: నియోజకవర్గంలో అటు అభివృద్ధి, ఇటు ప్రజాసమస్యలు ప్రజాప్రతినిధులకు కన్పించడంలేదు. రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన నిధులు కూడా ఎండమావుల్లా కన్పించడంలేదన్న విమర్శలున్నాయి. ప్రజలకు మాత్రం ఎటు చూసినా ఎండమావులే కన్పిస్తున్నాయి. నిండు వేసవిలో భూగర్భజలాలు అడుగంటి పోతుంటాయి. అయితే ఇక్కడ రైతులకు ఎప్పుడు చూసినా నీటి కష్టాలు తప్పడంలేదు. ప్రధాన పంటగా మామిడి, సన్ననిమ్మ పండిస్తుంటారు. అయితే వర్షాభావ పరిస్థితుల కారణంగా ఈ ఏడాది వర్షాలు కురవక పంటలు ఎండిపోతున్నాయి. చేతికందిన మామిడి, నిమ్మ కళ్లెదుటే ఎండిపోతుండడంతో రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. నియోజకవర్గానికి తాగు. సాగునీటిని



ట్యాంకర్ల ద్వారా నీరు అందిస్తున్న రైతు

అందిస్తున్నా అంటూ ప్రజాప్రతినిధుల ప్రకటనలు నీటిమీదరాతలయ్యాయి. మండలంలో 26 హెక్టార్లలో మామిడి, 1500ఎకరాల్లో సన్ననిమ్మ పంటలు సాగులో ఉన్నాయి. ఆ పంటలు ఎండిపోతుండడంతో చేసేదిలేక ట్యాంకర్ల ద్వారా నీళ్లు తోలేందుకు రైతులు సిద్ధమయ్యారు. బోర్లు, బావులు ఉన్న నీళ్లు అడుగంటడంతో ట్యాంకర్లను ఆశ్రయించారు. అయితే ట్యాంకర్ల ద్వారా నీరు తోలాలంటే చాలా కష్టతరమైంది. ఒక్కో ట్యాంకరు రూ.500. ట్యాంకర్ నీరు రెండు మామిడిచెట్లు లేదా నాలుగు సన్ననిమ్మచెట్లకు సరిపోతాయి. ఒక్కో రైతుకు దాదాపు 2వేల నుంచి 3వేలచెట్లు ఉన్నాయి. వాటిని బతికించడం ట్యాంకర్ల ద్వారా నీరు తోలడం చాలా కష్టతరంగా మారింది. మండలంలో సురభి, చిలేకాంపల్లె, మహదేవపల్లె, గంగారపువాండ్లపల్లె, చక్రాయపేట ప్రాంతాల్లో నీటి సమస్య ఎక్కువగా ఏర్పడింది. సకాంలో వర్షాలు రాక రైతులు పెట్టిన పంటలు ఎండిపోతున్నాయి. పంటలు సాగుచేయడానికి అధిక ఖర్చులు వచ్చాయి. ఈ ఏడాది మామిడిపంట కూడా తీవ్రంగా నష్టపోయారు. వేరుశనగ వేయలేదు. కేవలం వరి మాత్రం సాగు చేశారు. అది కూడా అంతంత మాత్రమే. ఎవరూ పట్టించుకోలేదని ఆవేదన చెందుతున్నారు.



ఎండిపోయిన బోరు

వ్యాపారులు, నేతల గుండెల్లో దడ

పోలీసు తనిఖీలలో బయటపడుతున్న నగదు, బంగారం

బద్వేలు, ఏప్రిల్ 21: ఎన్నికల కమిషన్ నిబంధనలు ఇటు వ్యాపారాలు, రాజకీయ నేతలను ఇరకాటంలోకి నెడుతున్నాయి. నగదు తరలిస్తున్న వారికి దడ పుట్టిస్తున్నాయి. ప్రధాన కూడలి, శివారు ప్రాంతాల్లో ముమ్మరం చేసిన పోలీసుల తనిఖీల్లో భారీగా నగదు, బంగారం, వెండి బయటపడుతోంది. అవసర నిమిత్తం డబ్బు తరలించలేని కొందరు వ్యాపారుల పరిస్థితి సంకటంగా మారింది. స్పష్టమైన ఆదేశాల మేరకు నాకాబంది, నిరంతరం వాహనాల తనిఖీతో వారికి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఏరకంగా డబ్బు తీసుకుపోతున్నా అందుకు సంబంధించిన ఆధారాలు చూపించాలని పోలీసులు కఠినం గా వ్యవహరి స్తుండడంతో భయపడుతున్నారు. ఓటర్లను కొనుగోలు చేసేందుకు డబ్బును తరలించకుండా అడుపుచేయడం మంచిదే కానీ సొంత పనుల నిమిత్తం కొద్ది మొత్తంలో డబ్బు తీసుకోవడానికి ఇబ్బందిగా మారడంతో వ్యాపారులు కష్టాలను ఎదుర్కొంటున్నారు. ఇతర ప్రాంతాల వ్యాపారులకు సంబంధించి హోల్ సేల్ వ్యాపారులు, వారాంతరాలు కలెక్షన్ చేసుకుని డబ్బు తీసుకెళ్లే వారి పరిస్థితి వర్ణనాతీతం. సాధారణంగా ఈడబ్బుకు సంబంధించి బిల్లులు ఉండవు. మొత్తం కలెక్షన్ పూర్తి చేసుకుని వెళ్తున్నపుడు వాహనాలు తనిఖీ చేసినడు ఈ డబ్బుకు సంబంధించి రుజువులు చూపాలన్న ఆదేశాలతో వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక రాజకీయ నాయకుల పరిస్థితి అయోమయంగా మారింది.

ఇప్పటి వరకు నగదు, బంగారమే...

బద్వేలు నియోజకవర్గంలో పీపీకుంట వద్ద వాహనాల తనిఖీలో ఇటీవల ప్రొద్దుటూరుకు చెందిన ఓ వ్యాపారి ఎలాంటి రశీదు లేకుండా బొలేరో వాహనంలో రూ.5కోట్ల విలువ చేసే 29 కిలోల బంగారు, వెండిని తీసుకెళుతుండగా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీనిని బట్టి తనిఖీల్లో ఎంత కఠినంగా వ్యవహరిస్తున్నారో అర్థమవుతోం ది. మరో వ్యక్తి నుంచి 658 గ్రాములు బంగారు స్వాధీనం చేసుకు న్నారు.



పీపీ కుంట చెక్‌పోస్టు వద్ద చేస్తున్న తనిఖీ

మరో వ్యాపారి నుంచి రూ.1,84 వేలు స్వాధీనం చేసుకోగా, ఇంకో వ్యక్తి నుం చి ఓ వ్యాపారి వ్యాపారం నిమిత్తం తీసుకె ళుతూ పోలీసులకు చిక్కారు. ఎన్నికల నిబంధన ల్లో కూడా తప్పకుండా పోలీసులు పాటిం చవలసిన బాధ్యత ఉండడంతో వారు కూడా కఠినంగా వ్యహరించాల్సిన బాధ్యత ఉండడంతో నిక్కచ్చిగా ఉంటున్నారు. ఏదేమైనా రుజువు చూపలేని నగదు, బంగారు తీసుకెల్లాలంటే బెంబేలెత్తున్నారు. ఎన్నికల సమయంలో పోలీసుల తనిఖీల రాజకీయ నేతలు బెంబే లెత్తుతున్నారు. పోలీసుల తనిఖీలతో ఇంతవరకు తమకు డబ్బు అందుతుందా అని రాజకీయ పార్టీల ద్వితీయ, తృతీయ శ్రేణల నాయకులు బెంగపట్టుకున్నట్లు కార్యకర్తలనడం విశేషం.

	విజేత	పార్టీ
1955	బొమ్ము రామారెడ్డి	స్వతంత్ర
1962	పాలకొలను నారాయణరెడ్డి	స్వతంత్ర
1967	శెట్టిపల్లె పెద్దనాగిరెడ్డి	కాంగ్రెస్
1972	శెట్టిపల్లె పెద్దనాగిరెడ్డి	కాంగ్రెస్
1978	డీఎల్ రవీంద్రారెడ్డి	స్వతంత్రం
1983	డీఎల్ రవీంద్రారెడ్డి	కాంగ్రెస్
1985	శెట్టిపల్లె రఘురామిరెడ్డి	టీడీపీ
1989	డీఎల్ రవీంద్రారెడ్డి	కాంగ్రెస్
1994	డీఎల్ రవీంద్రారెడ్డి	కాంగ్రెస్
1999	శెట్టిపల్లె రఘురామిరెడ్డి	టీడీపీ
2004	డీఎల్ రవీంద్రారెడ్డి	కాంగ్రెస్
2009	డీఎల్ రవీంద్రారెడ్డి	కాంగ్రెస్
2014	శెట్టిపల్లె రఘురామిరెడి	వైసీపీ
2019	శెట్టిపల్లె రఘురామిరెడ్డి	వైసీపీ

మూడో పర్యాయం ఓటమి ముప్పు

● ఉద్యమాల గడ్డ - అంతుచిక్కని వైనం ● అనేక మంత్రి పదవులు కూడా
● హ్యాట్రిక్ అంటే తెలియని నియోజకవర్గం ● రాయలసీమ కూడలి మైదుకూరు

మైదుకూరు, ఏప్రిల్ 21: రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలుపొందిన వారు మూడో దఫా ఓటమి తప్పదని మైదుకూరు నియోజకవర్గం తీరు చెబుతోంది. ఫిర్కాలుగా ఉన్న సమయంలోనే 1955లో మొట్టమొదటి ఎమ్మెల్యేగా స్వాతంత్ర సమరయోధుడు బొమ్ము రామారెడ్డి గెలుపొందారు. పాతికేళ్ల వయసులోనే 1962లో రెండో ఎమ్మెల్యేగా విజయం పొందిన స్వతంత్ర అభ్యర్థి పాలకొలను నారాయణరెడ్డి పోరుమామిళ్ల వాసి. ఉద్యమాల గడ్డగా పేరొందిన మైదుకూరు నియోజకవర్గానికి పలు దఫాలు మంత్రి పదవులు వరించాయి. అయినా నియోజకవర్గం ప్రజలు ఎవరికీ హాట్రిక్ ఇవ్వక పోవడంతో ప్రజా బలం సాధించాలంటే కత్తిమీద సాములాంటిదేనని నేతలు చెప్పేవారు. బలిజ సామాజిక వర్గీయులే గెలుపోటములను శాశించగలరని తెలుస్తోంది.

ఉద్యమాలకు, ప్రజా చైతన్యానికి మైదుకూరు పుట్టినిల్లు. ప్రధాన నగరాలైన హైదరాబాదు, బొంబాయి, కలకత్తా, చెన్నై, బెంగుళూరు తదితర నగరాలకు అనుసంధానిస్తూ రాయలసీమ ప్రాంతాల ప్రధాన కూడలిగా మైదుకూరు నిలిచింది. 1955లో నియోజకవర్గానికి అంకురార్పణ జరగడంతో ఇప్పటి వరకు మొత్తం 14 పర్యాయాలు అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించారు. ఇక్కడే రెడ్లదే ఆధిపత్యం. శెట్టిపల్లె రఘురామిరెడ్డి, డీఎల్




రవీంద్రారెడ్డి నడుమ ఎన్నికలు జరిగేవి. రాష్ట్ర విభజన అనంతరం మాజీ మంత్రి డీఎల్ ఎన్నికల బరి నుంచి తప్పుకోవడం, టీడీపీ నుంచి రఘురామిరెడ్డి వైసీపీలో చేరడంతో టీడీపీలో అభ్యర్థి కరువయ్యారు. దీంతో టీడీపీ నేత, మాజీ మంత్రి యనమల రామక్రిష్ణ వియ్యంకుడు, ప్రముఖ కాంట్రాక్టరు, బి.మఠం వాసి పుట్టా సుధాకర్ యాదవ్‌ను టీడీపీ నుంచి ఎన్నికల బరిలో నిలిపారు. అయితే 2014,2019 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి విస్తృత ప్రచారం చేసినా నియోజకవర్గంలో ప్రజలు కనికరించలేదు. పుట్టా ప్రజా బలం చూరగొనలేక పోయారు.

గొప్ప చరిత్రే

అసెంబ్లీ ఎన్నికల్లో మైదుకూరు నియోజకవర్గానికి గొప్ప చరిత్రే ఉంది. 1955 నుంచి జరిగిన ఎన్నికల్లో బొమ్ము రామారెడ్డి, పాలకొలను నారాయణ రెడ్డి, శెట్టిపల్లె పెద్ద నాగిరెడ్డి, దుగ్గిరెడ్డి లక్ష్మిరెడ్డి గారి రవీంద్రారెడ్డి, శెట్టిపల్లె రఘురామిరెడ్డి ఉన్నారు. 1962లో పోరుమామిళ్ల తాలుకా అక్కలరెడ్డిపల్లె వాసి పాలకొలను నారాయణరెడ్డిని 25 ఏళ్ళ వయస్సులోనే ఎమ్మెల్యేగా ఎన్నుకున్నారు. 1972లో శెట్టిపల్లె పెద్ద నాగిరెడ్డిని కాంగ్రెస్ తరపున ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాగా 1994 ఎన్నికల్లో డీఎల్ రవీంద్రారెడ్డి శెట్టిపల్లె రఘురామిరెడ్డిపై కేవలం 28 ఓట్లతో గెలిచి చరిత్ర సృష్టించారు. 1967 నుంచి ఇప్పటి వరకు జరిగిన శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు ఎవరైనా రెండు సార్లు గెలిస్తే మూడో సారి ఓడి పోవడం ఆనవాయితీగా వస్తోంది. 1967, 72లో శెట్టిపల్లె పెద్ద నాగిరెడ్డి, 1978, 83, 89, 94, 2004, 2009లలో డీఎల్ రవీంద్రారెడ్డి గెలుపొందారు. 2009, 2014 ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా శెట్టిపల్లె రఘురామిరెడ్డి వరుసగా రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఇప్పుడు జరిగే ఎన్నికల్లో చూడాల్సింది.

మొదట్లో ఫిర్కాల ప్రాతిపాదికన

మొట్ట మొదటి సారిగా అసెంబ్లీ ఎన్నికలు ఫిర్కాల ప్రాతిపాదికన ఎన్నికల సంఘం నిర్వహించింది. మైదుకూరు కింద పోరుమామిళ్ల, పలుగురాళ్ళపల్లె, నంద్యాలంపేట, వనిపెంట ఫిర్కాలు ఉండేవి. 1955లో స్వాతంత్ర సమరయోధుడు బొమ్ము రామారెడ్డికి మొదటి విజయం దక్కింది. అటు తరువాత 1967లో పునర్విభజన జరగ్గా ప్రొద్దుటూరు, కడప తాలుకా పరిధిలోని దువ్వూరు, చాపాడు, చెన్నూరు మైదుకూరు నియోజకవర్గం పరిధిలోకి వచ్చాయి. 1978లో మరో దఫా జరిగిన పునర్విభజనలో చెన్నూరు కడప నియోజకవర్గంలోనూ, చాపాడు మండలం ప్రొద్దుటూరు నియోజకవర్గంలోనూ కలిశాయి. దీంతో ఖాజీపేట వాసి డీఎల్ రవీంద్రారెడ్డి 1978 నుంచి ఎన్నికల రంగంలో అడుగెట్టారు. చివరగా 2004లో తిరిగి మైదుకూరు నియోజకవర్గంలో చేరుస్తూ జరిగిన పునర్విభజన వరకూ డీఎల్ పోటీలో ఉన్నారు.



బొమ్ము రామారెడ్డి



పాలకొలను నారాయణరెడ్డి



శెట్టిపల్లె పెద్ద నాగిరెడ్డి



డీఎల్ రవీంద్రారెడ్డి

మంత్రి పదవుల్లో డీఎల్ ఒక్కరే

కాగా మైదుకూరు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన వారిలో డీఎల్ రవీంద్రారెడ్డి ఒక్కరే మంత్రి పదవులు అలంకరించారు. 1989, 94, 2004లో ఆయన నేదురుమల్లి జనార్ధనరెడ్డి, కోట్ల విజయభాస్కర్‌రెడ్డి మంత్రి వర్గంలో పదవులు దక్కించుకున్నారు. రాష్ట్ర విభజన సమయంలోనూ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి హయాంలో కూడా మంత్రి పదవిలో ఉన్న ఆయన రాష్ట్ర విభజనపై వ్యతిరేకతపై బర్తరఫ్‌కు గురయ్యారు.

సమస్యలున్నాయి ప్రభూ....

అంజాద్‌ను నిలదీసిన ఎర్రముక్కపల్లె వాసులు



అంజాద్ బాషాను ప్రశ్నిస్తున్న వీధివాసులు

మారుతీనగర్, ఏప్రిల్ 21: ఎర్రముక్కపల్లె బాల వికాస్ పాఠశాల సమీప దూదేకుల భవన్ వీధిలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, డిప్యూటీ సీఎం ఎస్‌బీ అంజాద్‌బాషాను ఆ వీధి నివాసులు సమస్యలపై ఏకరువు పెట్టి నిలదీశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం నగర ఎర్రముక్క పల్లె బాల వికాస్ పాఠశాల సమీప దూదేకుల భవన్ వీధిలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, డిప్యూటీ సీఎం ఎస్‌బి అంజాద్‌బాషాను ఆ వీధి నివాసులు సమస్యలపై ఏకరువు పెట్టి నిలదీశారు. ప్రధానంగా తాగునీటి బోరు చెడిపోయి నాలుగేళ్లవుతున్నా ఇంతవరకూ బాగు చేస్తామన్నా ధ్యాసే లేదన్నారు. దీంతో పాటు డ్రైనేజీ సమస్య, అధ్వాన్నంగా రోడ్లు ఉన్నాయని వాపోయారు. ముఖ్యంగా విద్యార్థులకు మేనమామను అంటూ డబ్బా కొట్టుకుంటున్న జగన్‌రెడ్డి ఇంత వరకు విద్యా దీవెన, వసతి దీవెన ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పై పెచ్చు బటన్ నొక్కుతున్నాను అంటూ బడాయి మాటాలు మాట్లాడడం తప్ప ఆ బటన్‌ల ద్వారా విద్యార్థుల తల్లిదండ్రుల ఖాతాలో డబ్బులు జమ కావడం లేదని నిలదీశారు.

ఎవరడిగినా మా ఓటు మీకే ...!

ఏ పార్టీ సభకైనా సరే.... ● అభ్యర్థుల్లో అయోమయం

లోకం తీరు



కడప ఎర్రముక్కపల్లె, ఏప్రిల్ 21: ఎన్నికల వేళ విచిత్ర పరిస్థితులు నెలకొన్నాయి. ఏ పార్టీ నాయకుడు పిలిచినా ర్యాలీలు, ప్రచారానికి హాజరవుతున్నారు. ఈ విషయంపై ప్రత్యర్థి నేత ప్రశ్నిస్తే ఇంటికి వచ్చి పిలిచారు, కానీ మా ఓటు మాత్రం మీ పార్టీకే బాబు అని సమాధానం చెబుతున్నారు. దీంతో వారు ఎవరికి ఓటు వేస్తారోనన్న అయోమయం అభ్యర్థుల్లో నెలకొంది. గత ఎన్నికల వరకూ లేని ఈ విచిత్ర పరిస్థితి ప్రస్తుత ఎన్నికల్లో నెలకొనడంతో ఓటర్ల నాడి పట్టలేక అభ్యర్థులు తలలు పట్టుకుంటున్నారు. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా తమకు ఇబ్బంది ఉండకూడదన్న ఉద్దేశంతోనే ఈ పరిస్థితి నెలకొందని చెప్పవచ్చు. ఇటువంటి జాబితాలో ప్రస్తుతం పురుషులుతో పాటు మహిళలు కూడా చేరిపోయారు. ఇప్పటికే నగరాల్లో, గ్రామాల్లో రాజకీయ వాతావరణం వేడెక్కిన నేపథ్యంలో ప్రచారాలు ఊపందుకున్నాయి. టీడీపీ, వైసీపీ, బీజేపీ కాంగ్రెస్, జనసేన నేతల ప్రచారం పోటాపోటీగా అర్ధరాత్రి వరకు సాగుతోంది. అభ్యర్థులు పర్యటిస్తున్న సమయంలో ఘనంగా ఆహ్వానం పలకానే ఉద్దేశంతో స్థానిక నాయకులు ముందురోజే ఇంటింటికీ వెళ్ళి తమ నాయకుని ప్రచారానికి రావాలని కోరుతున్నారు. దీంతో ఆహ్వానాన్ని మన్నించిన కొందరు నాయకుల ప్రచారాలకు బహిరంగంగా వెళ్లి మద్దతు పలికి వారితో ర్యాలీలు ప్రచారాల్లో పాల్గొంటున్నారు. ప్రస్తుతం మీ కంటే మాకే మెజార్టీ వస్తుందని నేతలు ప్రచారం చేసుకుంటున్నారు. ప్రచారంలో తిరిగే వారివల్ల లోలోపల ఆందోళన చెందుతున్నారు. సర్వేలు చేసేవారు కూడా ఇటువంటి వారిని ప్రశ్నిస్తే పార్టీలదేముంది. ఎన్నికల రోజున మాకు ఇష్టం వచ్చిన వారికి ఓటు వేస్తాం అంత వరకు ఏ ఒక్క పార్టీ నేతలకు చెడ్డ కాకుండా ఉండకూడదు కదా అని సమాధానాలు చెబుతున్నారు. దీంతో ఇటువంటి వారితో రాజకీయ పార్టీ నేతలకు అంతుచిక్కడం లేదు.

తెలుసుకోండి...

జిల్లాలో ఓటర్లు 16, 27,356 మంది

మహిళలు 832070 ● పురుషులు 795071 ● ఇతరులు 215

కడప(కలెక్టరేట్) ఏప్రిల్ 21: జిల్లాలో 16,27356 మంది ఓటర్లు మే13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. అందులో పురుషులు 795071, మహిళలు 83,2070 కాగా ఇతరులు 215 మంది ఉన్నారు. మహిళా ఓటర్లు పురుషుల కంటే అధికంగా 37001 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. మహిళా ఓటర్లు ఈదఫా ఎన్నికల్లో అభ్యర్థుల భవితవ్యాన్ని తేల్చనున్నారు. కొత్త ఓటర్ల నమోదుకు సంబంధించి ఈనెల 14 అర్థరాత్రికి ఫారం-6కు సంబంధించి 4 వేల పైచిలుకు మంది కొత్త ఓటర్లుగా దరఖాస్తు చేసుకున్నారు. వీరందరినీ క్రోడీకరించిన అర్హులైన వారికి ఓటు కల్పించేందుకు ఎన్నికల సిబ్బంది కసరత్తు ముమ్మరం చేశారు. ఈనెల 25న ఓటర్ల జాబితా తుది ప్రకటన నాటికి జిల్లాలో 16.30లక్షల ఓటర్లు నమోదయ్యే అవకాశాలున్నాయి. కడప పార్లమెంట్ పరిధి 7 నియోజకవర్గాల్లో మొత్తం 1627356 మంది ఓటర్లున్నారు.

నియోజక వర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
బద్వేలు	108522	109487	05	218014
కడప	136435	143313	90	279838
పులివెందుల	111070	117284	18	228372
కమలాపురం	99083	103487	34	202604
జమ్మల మడుగు	117295	124332	15	241642
ప్రొద్దుటూరు	119130	127040	48	246218
మైదుకూరు	103536	107127	5	210668
మొత్తం	795071	832070	215	1627356

జగన్నాటకం

సానుభూతి కోసమే గులకరాయి డ్రామా

ఓట్ల కోసం చిల్లర చేష్టలు ప్రజలు నమ్మరన్నా : సీపీఐ



మేనిఫెస్టోను అవిష్కరిస్తున్న ఓబులేసు, తదితరులు

కడప (మారుతీనగర్) ఏప్రిల్ 21: కోడి కత్తి డ్రామాను తలపించేలా మరో మారు ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజల సానుభూతి పొందడం కోసం గులకరాయి డ్రామాకు తెరలేపారని భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి. ఓబులేసు ఎద్దేవా చేశారు. రానున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా జనం కోసం-జనం మధ్యకు- జన ప్రణాళిక పేరుతో సీపీఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో రూపొందించిన ప్రత్యేక ఎన్నికల మేనిఫెస్టోను స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆవిష్కరించిన ఆయన మాట్లాడుతూ జగన్‌రెడ్డి చేపట్టిన మేమంతా సిద్ధం బస్సుయాత్రకు ప్రజల నుంచి అనుకున్నంత స్పందన లేకపోగా ఓడిపోతున్నామన్న బాధతో గులకరాయి నాటకానికి ఆజ్యం పోశారన్నారు. సీఎం కావాలనే ఆశతో జనంలో తిరిగి ప్రజల నెత్తిన చేయిపెట్టిన జగన్‌రెడ్డి అధికారం చేపట్టాక బయట తిరగడం పూర్తిగా మానేశారన్నారు. ఒకవేళ ఏదేని పరిస్థితుల్లో రావాల్సివస్తే పరదాల మాటున, అత్యధిక పోలీసుల బందోబస్తు మధ్య మెరుపుతీగలా అలా వచ్చి ఇలా వెళ్ళిపోయిన సందర్భాలున్నాయన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో తప్పని పరిస్థితుల్లో మేమంతా సిద్ధం బస్సుయాత్ర పేరుతో ప్రజల ముందుకు రాక తప్పలేదన్నారు. సరిగ్గా బస్సుయాత్ర 13న విజయవాడలోని సింగ్‌నగర్‌కు చేరుకోగానే అప్పటికే రాత్రి కావడం, కరెంట్ కూడా పోవడం బస్సు టాప్‌పై నిలబడి వుండడం ఒక ప్రణాళిక అన్నారు. ఏది ఏమైనా ఓట్ల కోసం జగన్‌రెడ్డి వేసే చిల్లర చేష్టల వలన ప్రజల్లో సానుభూతి రాదన్నారు. గులకరాయి డ్రామాను రక్తి కట్టించడానికి వైసీపీ అనుకూల మీడియా ప్రవర్తిస్తున్న తీరు సరైందికాదన్నారు. ఏది ఏమైనా జగన్‌రెడ్డికి ఒక వేళ సానుభూతి రావానుకుంటే గులకరాయితో కాకుండా ఏ కాలో..చేయో తెగ్గోసుకుని తిరగలేక వుంటే సానుభూతి పతాకస్థాయికెళ్లి మరో సారి ముఖ్యమంత్రి కాగలిగే వారన్నారు. జనహితమే లక్ష్యంగా రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన ఎన్నికల మేనిఫెస్టోను ఆవిష్కరింపచేశారు. సమావేశంలో కమలాపురం అసెంబ్లీ అభ్యర్థి గాలిచంద్ర, నేతలు వెంకటశివ, గుంటి వేణుగోపాల్, కృష్ణమూర్తి, చంద్రశేఖర్, మనోహర్‌రెడ్డి, బాదుల్లా, తదితరులు పాల్గొన్నారు.

పెత్తందార్లకు నీళ్లు.. అన్నదాతకు కన్నీళ్లు

● పక్కదారి పట్టిన సర్వరాయసాగర్ లక్ష్యం

● పొలాలు బీళ్లు.. సంపన్నులకు నీళ్లు

బీళ్లన్నీ పంటభూములై.. పల్లెలన్నీ సస్యశ్యామలమై.. పేదింట సుఖసం తోషాలు వెల్లివిరియాలన్న నాటి పాలకుల సంకల్పం నీరు గారిపోతోంది. నీళ్లు, నిధులు సంపన్నుల చెంతకే చేరుతున్నాయి.. పొలం తడ వక, పైరు పండక రైతులు దిక్కులు చూస్తున్నారు.. కమలాపురం నియోజకవర్గ పరిధిలో 25వేల ఎకరాలకు సాగు, తాగునీరు అందిం చాలనే సర్వరాయ సాగర్ ప్రాజెక్టు పరిస్థితి ఇది. పట్టించుకునే నాథుడు లేక ప్రాజెక్టు పూర్తికాలేదు.. ప్రస్తుతం ఉన్న నీరు కూడా పరిశ్రమలు, చేపల చెరువుల సొంతమవుతోంది.




సర్వరాయసాగర్... పిచ్చిమొక్కలతో నిండిపోయిన రిజర్వాయర్ కుడి, ఎడమ కాల్వలు

వీరపునాయునిపల్లె, ఏప్రిల్ 21: గాలేరు- నగరి సుజల స్రవంతిలో భాగంగా కమలాపురం నియోజకవర్గానికి సాగునీరు అందించాలనే ఉద్దేశంతో మండలంలోని కొమ్మది-ఇందుకూరు మార్గమధ్యలో సర్వరాయసాగర్ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారు. ఆనకట్ట నిర్మాణ పనులు నిధుల కొరతతో ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. 2004లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రూ.294 కోట్ల నిధులతో సర్వరాయ సాగర్, వామికొండ రిజర్వాయర్లకు శంకుస్థాపన చేసి రిజర్వాయర్ ఆనకట్ట నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ పనులను గ్యామెంట్ ఇండియా అనే సంస్థకు అప్పగించారు. నాటి నుంచి నేటికీ పనులు అసంపూర్తిగానే ఉండటంతో సాగుకు ఎలాంటి ఉపయోగం లేకుండా పోయింది. ఆనకట్ట పూర్తి అయితే కమలాపురం నియోజకవర్గ పరిధిలో 25వేల ఎకరాలకు సాగునీరు, తాగునీరు అందుతుంది. ఆనకట్ట నిర్మాణంలో భాగంగా ఆనకట్టకు సంబంధించిన భూ ముల సేకరణ పూర్తయి రైతులు డబ్బు తీసుకున్నారు. మట్టికట్ట, రివిట్‌మెంట్ పనులు పూర్తయి, కుడి, ఎడమ కాల్వల నిర్మాణం పనులు నిర్మాణం పనులు చేసేందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలో భాగంగా రూ.212 కోట్ల కాల్వలకు సంబంధించిన నిధులను విడుదల చేయడంతో పాటు కట్ట వద్ద స్థానిక ఎమ్మెల్యే చేతులమీదుగా భూమిపూజ చేశారు. ఆపై సంబంధిత కాంట్రాక్టర్ పనులను ఆరంభించకుండా పనులు ముందుకు సాగడం లేదు. పనులు పూర్తి కాకపోవడంతో ఈ రిజర్వాయర్ ద్వారా ఒక ఎకరా కూడా సాగునీరు అందించలేకపోతున్నారు. దీంతో రైతుల కల సాకారం ఎప్పుడోనని ఎదురుచూస్తున్నారు. పనులు చేసేందుకు నిధులు ఉన్నా కాంట్రాక్టర్ పనులు చేయకుండా నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. 80 శాతం మట్టి పనులు, రివిట్‌మెంట్ పనులు పూర్తయ్యాయని, మిగిలిన 20శాతం పూర్తయితే కమలాపురం నియోజకవర్గ పరిధిలో 25వేల ఎకరాలకు సాగునీరు, తాగునీరు అందుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కాగా సర్వరాయసాగర్ నిర్మాణ పనులు పూర్తిచేస్తామని సాగునీరు 25వేల ఎకరాలకు అందిస్తామని నేతలు గొప్పలు చెప్పారు. 2004లో పనులు ప్రారంభించారు. మూడు ఆర్‌టీఎంసీల సామర్థ్యంతో కుడి, ఎడమ కాల్వల డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ కూడా నిర్మించలేదు. కానీ సర్వరాయసాగర్‌లో సాగునీరు ఉన్నా ఒక్క ఎక రాకు కూడా నీరు అందడం లేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఇక్కడి నుంచి భారతి సిమెంట్ కార్మాగారానికి, స్థానిక నేత చేపల చెరువులకు మాత్రమే నీళ్లు వదులుతున్నారు. దీంతో రైతులకు ఎలాంటి ఉపయోగం లేకుండా పోయింది.

శిల్పారామంలో సందడే సందడి



కడప శిల్పారామంలో స్టెప్స్ వేస్తున్న చిన్నారులు



నృత్యం చేస్తున్న కిషోర్ డ్యాన్ అకాడమీ బృందం

కడప (మారుతీనగర్), ఏప్రిల్ 21: ఆట విడుపులో భాగంగా ఆదివారం నగర రిమ్స్ సమీప శిల్పారామం ప్రేక్షకుల తాకిడితో సందడే సందడిగా నెలకొంది. అక్కడి సాంస్కృతిక కళావేదికపై మిష్పా మూవి ఆధ్వర్యంలో కడప నగరానికి చెందిన అరవింద్‌నగర్‌కు చెందిన స్మైల్ కిడ్స్ ఇంగ్లీషు మీడియం స్కూల్ విద్యార్థినీ, విద్యార్థులు తమ బుడిబుడి స్టెప్పులతో ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నారు. ఇందులో ప్రధానంగా వుట్టిమీద కూడు, కాలేజీ పాపలు, రౌడీ బేబీ, ఆటకావాలా.. తదితర పాటలకు చిన్నారులు వేసిన నృత్యాలు అలరించాయి.

పులివెందులలో అలరించిన ప్రదర్శనలు

పులివెందుల టౌన్, ఏప్రిల్ 21: పట్టణంలోని డాక్టర్ వైఎస్సార్ ఉలిమెల్ల లేక్ ఫ్రంట్‌లో ఆదివారం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు సందర్శకులను ఆకట్టుకున్నాయి.

పరిపాలన అధికారి సుధాకర్ పర్యవేక్షణలో కిషోర్ డ్యాన్ అకాడమీ కడప వారి శిష్యబృందంచే జానపద, సినిమా పాటలకు నృత్యాలు చేశారు. డీజే టిల్లు, వస్తావ జానకి, నవ్వుకుంటూ వెళ్లిపోమాకే తదితర పాటలకు నృత్య ప్రదర్శనలు ఇచ్చారు.

కాంగ్రెస్ లీగల్ చైర్మన్‌గా రామగంగిరెడ్డి

కడప(కలెక్టరేట్), ఏప్రిల్ 21: కాంగ్రెస్ కమిటీ జిల్లా లీగల్ సెల్ చైర్మన్ గా న్యాయవాది వై.రామగంగిరెడిని నియమిస్తూ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గుండ్లకుంట శ్రీరాములు ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన పీసీసీ అధ్యక్షురాలు షర్మిలారెడ్డికి, మాజీ రాజ్యసభ సభ్యుడు తులసిరెడ్డికి, చైర్మన్ రామగంగిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

'పూర్వవైభవం చాటేలా విజయంతో రావాలి'

కడప(కలెక్టరేట్), ఏప్రిల్ 21: సార్వత్రిక ఎన్నికలు 2024లో అసెంబ్లీ నియోజక వర్గాల్లో పోటీ చేసే అభ్యర్థులను పీసీసీ అధ్యక్షురాలు, కడప పార్లమెంట్ అభ్యర్థి వైఎస్ షర్మిలారెడ్డి ఖరారు చేశారు. ఈ ఎన్నికల్లో పోటీ చేసే నియోజకవర్గాల అభ్యర్థులందరికీ కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో బీ-ఫారమ్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పూర్వ వైభవం చాటేలా అభ్యర్థులందరూ ఎన్నికల్లో విజయం సాధించాలన్నారు. మేనిఫెస్టోలోని అన్ని అంశాలను ప్రజలందరికీ వివరించాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే దళిత, మైనార్టీ,బడుగు వర్గాలతో పాటు అన్ని వర్గాలకు సమన్యాయం, సంక్షేమ ఫలాలు అందజేస్తామన్నారు. మళ్లీ వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాలనను ప్రజలందరికి అందేలా చూస్తామన్నారు. అనంతరం డీసీసీ కార్యాలయంలో తులసిరెడ్డి, సునీత సమక్షంలో అభ్యర్థులకు బి.ఫారంలను అందజేశారు.

బీ-ఫారమ్స్ అందుకున్న కాంగ్రెస్ అభ్యర్థులు వీరే...

మైదుకూరు అసెంబ్లీ నియోజకవర్గం అభ్యర్థిగా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గుండ్లకుంట శ్రీరాములుకు, కడప అభ్యర్థిగా అఫ్జల్ ఖాన్, ప్రొద్దుటూరు అభ్యర్థిగా షేక్ మహమ్మద్ పూల నజీర్, జమ్మలమడుగు అభ్యర్థిగా పాముల బ్రహ్మానందరెడ్డి, బద్వేలు నియోజక వర్గ అభ్యర్థిగా ఎన్.డి. విజయజ్యోతి, పులివెందుల నియోజక వర్గం అభ్యర్థిగా ఎన్ ఎస్‌యుఐ జాతీయ నాయకులు మూలంరెడ్డి ధృవకుమార్ రెడ్డిలకీ బీ-ఫారంలు అందజేసి,విజయంతో తిరిగి రావాలని షర్మిలా రెడ్డి ఆశీర్వదించారు.

కాంగ్రెస్‌కు యూత్ కాంగ్రెస్ వెన్నెముక

● జిల్లా అధ్యక్షుడు బండి సుమంత్ కుమార్

కడప(కలెక్టరేట్), ఏప్రిల్ 21: కాంగ్రెస్ పార్టీకి వెన్నెముక లాంటి యూత్ కాంగ్రెస్‌ను పీసీసీ అధ్యక్షురాలు విస్మరించడం బాధాకరమని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బండి సుమంత్ కుమార్ అన్నారు. ఆదివారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ షర్మిలమ్మ నామినేషన్ సమయంలో యూత్ కాంగ్రెస్‌ను విస్మరించడం సరియైందికాదన్నారు. యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో అత్యధిక ఓట్లతో గెలిచానని, కాంగ్రెస్‌కు, వైఎస్ కుటుంబానికి విధేయుల మన్నారు. కొందరు నాయకులు చెప్పుడు మాటలు విని తమను కలుపు కోకుండా పోవడం సరైంది కాదని ఆయన పేర్కొన్నారు.



హనుమాన్ జయంతి శోభాయాత్రలో విశ్వప్రగతి చిట్ ఫండ్స్ మేనేజింగ్ డైరెక్టర్ తుంగా రమణయ్య

కోదండరామయ్యకు కోటి తలంబ్రాలు



గోటితో వలచిన బియ్యాన్ని ఒంటిమిట్ట దేవస్థానంలో అందజేస్తున్న సానె శ్రీనివాసులు తదితరులు

కడప (కల్చరల్), ఏప్రిల్ 21: శ్రీరామచంద్రుని వారసులైన సగర (ఉప్పర) కులస్తులు ఆదివారం సాయంత్రం ఒంటిమిట్ట కోదండరామాలయంలో గోటితో వలచిన కోటి తలంబ్రాలు, పట్టు వస్త్రాలు, ముత్యాలను, మంగళ వాయిద్యాల నడుమ శోభా యాత్రగా వెళ్లి స్వామి వారికి సమర్పించారు. వారు ఆ బియ్యాన్ని గత 15 రోజులుగా అత్యంత భక్తిశ్రద్ధలతో శ్రమించి గోటితో వలిచారు. ఈ కార్యక్రమంలో నగర సంఘం జిల్లా అధ్యక్షుడు సానే శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు కురాకు సుబ్బరాయుడు, విశ్రాంత డిఎస్‌పి కురాకు వెంకటయ్య, శ్రీరాములు, రామయ్య, రాజంపేట శంకరయ్య, సానె శ్రీని వాసులు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో ఘనంగా శ్రీరామ శోభాయాత్ర



కడప (కల్చరల్), ఏప్రిల్ 21: ఆకాశమే హద్దుగా ఆదివారం నగరంలో శ్రీరామ శోభాయాత్ర నిర్వహించారు. శ్రీరామ నవమిని పురస్కరించుకుని హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో సాయంత్రం 4 గంటలకు నగర అశోక్ నగర్‌లోని సీతారాముల ఆలయం నుంచి ప్రారంభమైన శోభాయాత్ర నగర ప్రధాన కూడళ్ల గుండా అప్సర థియేటర్, వై జంక్షన్, ఆర్టీసీ బస్టాండు, రాజీవ్ పార్క్, యర్రమయుక్కపల్లె, కోటిరెడ్డి సర్కిల్, సెవెన్‌రోడ్స్, పాతబస్టాండు, గాలిదేవర ఆంజనేయ స్వామి దేవాలయం వరకూ సాగింది. ఇందులో అడుగడుగునా రామభక్తులు జై శ్రీరామ్ అంటూ జనాలు పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వేదిక నాయకులు మాట్లాడుతూ హిందు సమాజంలో పరివర్తన చైతన్యం రావాల్సిన అవసరం ఉందన్నారు. రామునిపైన భక్తి, విస్వాసం పెరగాలని శోభా యాత్ర నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ముఖ్యంగా శ్రీరామచంద్రమూర్తి సమస్త మానవాలికి ఆదర్శప్రాయుడన్నారు. ఈ కార్యక్రమంలో విజయానందరెడ్డి, చంద్రమౌళీ శర్మ, వేలాధిగా రామ భక్తులు పాల్గొన్నారు.

టీడీపీలో 20 కుటుంబాలు చేరిక



టీడీపీలో చేరుతున్న చిన్నచెప్పలి గ్రామస్థులు

కమలాపురం రూరల్, ఏప్రిల్ 21: కమలాపురం రూరల్ మండల పరిధిలోని చిన్న చెప్పలి గ్రామానికి చెందిన సుబ్బారెడ్డి, రామ్‌ప్రసాద్‌రెడ్డి, అబ్దుల్ ఖాదర్, రామకృష్ణారెడ్డి, రామాంజినేయరెడ్డి, సద్దామ్‌హుసేన్ సహకారంతో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా పుత్తా నరసింహారెడ్డి మాట్లాడుతూ వైసీపీ ఒంటెద్దు పోకడలు నచ్చకనే టీడీపీలోకి వస్తున్నారని వీరి చేరికతో టీడీపీ బలోపేతం అవుతుందన్నారు. కమలాపురం ని యోజకవర్గంలో అధిక శాతం ప్రజలు టీడీపీ వైపు మొగ్గు చూపుతున్నారని రాను న్న ఎన్నికల్లో తెలుగుదేశం విజయం తప్పదన్నారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అవుతారని రాష్ట్ర ప్రజలు చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారని తెలిపారు. చంద్రబాబుపై నమ్మకంతో బాబుతోనే ఈ రాష్ట్ర అభివృద్ధి చెందుతుందని నమ్మి బాబుకు అండగా ఉంటామని తెలుగుదేశం పార్టీలో చేరడం సంతోషకరమన్నారు. పార్టీలో చేరిన వారందరికి అండగా ఉంటామన్నారు. ఏ సమస్య వచ్చిన ఏ అవసరం ఉన్న నాకు ఫోన్ చేస్తే మీ వద్దకు వస్తానన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే మీ అందరికి మంచి గుర్తింపునిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో దేవరాజుపల్లె నాగిరెడ్డి, జయరామిరెడ్డి, బాబు, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే ఏపీకి ఉజ్వల భవిష్యత్తు

వల్లూరు, ఏప్రిల్ 21 :టీడీపీతోనే ఏపీకి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని టీడీపీ ఉపాధ్యక్షుడు, కమలాపురం నియోజకవర్గం ఇన్‌చార్జ్ పుత్తా నరసింహారెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని తప్పెట్ల గ్రామ పంచాయితీలో మీ భవిష్యత్తుకు మేము గ్యారెంటీలో భాగంగా ప్రచారాన్ని నిర్వహించి మాట్లాడారు. టీడీపీ అధికారంలోకి రాగానే సంక్షేమ సూపర్‌సిక్స్ పథకాలను అందిస్తామన్నారు. వైసీపీ హయాంలో నవరత్నాల పేరుతో ప్రజలను దగా చేశారన్నారు. బటన్ నొక్కుడు పేరుతో ప్రజలతో దొంగాట ఆడుతున్నారని ఎద్దేవా చేశారు. మహిళా సాధికారత అంటున్నారే కానీ వారికి రక్షణ కరువైందన్నారు. ఇసుక దోపిడీ, భూముల అన్యాక్రాంతం, మోసాలు ప్రజలు గమనిస్తున్నారన్నారు. రానున్న ఎన్నికలలో టీడీపీకి ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అలాగే టి. కొత్తపల్లిలో ఇందిరెడ్డి తిమ్మారెడ్డి ఇంటికి వెళ్లి మంతనాలు జరిపారు. రానున్నది టీడీపీ ప్రభుత్వమే అని అందరికీ సహకారం అందజేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన సోదరుడి కుమారుడు పుత్తా సాయినరసింహారెడ్డి, జనసేన ఇన్‌చార్జ్ వేణుగోపాల్ రెడ్డి, తిమ్మారెడ్డి, టీడీపీ మండలాధ్యక్షుడు నాగేశ్వరరెడ్డి, గడికోట సుధాకర్‌రెడ్డి, నాగిరెడ్డి, సుబ్బరామిరెడ్డి, సాతాను నాగిరెడ్డి, సుబ్బారెడ్డి, సదాశివారెడ్డి, వెంకటరామిరెడ్డి, చెప్పల్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, శివారెడ్డి, రఘునాథరెడ్డి, విశ్వరనాధరెడ్డి ఓబుల్‌రెడ్డి, రవీంద్రనాథ్‌రెడ్డి, రామమనోహర్‌రెడ్డి, రెడ్డయ్య పాల్గొన్నారు. అంతకు ముందు గ్రామస్థులు పుత్తాకు స్వాగతం పలికి క్రేన్‌తో భారీ గజ మాల వేశారు.

బీటెక్ రవిని గెలిపించండి



గురిజాలలో ప్రచారం నిర్వహిస్తున్న జయభరత్‌రెడ్డి

సింహాద్రిపురం, ఏప్రిల్ 21: పులివెందుల టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బీటెక్ రవిని గెలిపించాలని పార్టీ నాయకులు ఓటర్లను కోరారు. ఆదివారం మండలంలోని గురిజాల గ్రామంలో పులివెందుల ఎమ్మెల్యే అభ్యర్థి సోదరులు మారెడ్డి జయభరత్‌రెడ్డి, మారెడ్డి జోగిరెడ్డి, టీడీపీ సీనియర్ నేత అజ్జుగుట్టు రఘునాథరెడ్డి టీడీపీ సంక్షేమ పథకాలను వివరిస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కందుల ఓబుల్‌రెడ్డి, మురళీమోహన్ యాదవ్, వాసు, రామచంద్రారెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీకి ఓటు అభివృద్ధికి చోటు



రామనపల్లెలో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నేతలు

చెన్నూరు, ఏప్రిల్ 21: తెలుగుదేశం పార్టీకి వేసే ప్రతి ఓటు అభివృద్ధికి చోటు అని మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ బుజ్జన్న అన్నారు. రామనపల్లెలో ఆదివారం జిల్లా అధికార ప్రతినిధి మన్నూరు అక్బర్, బీసీసెల్ జిల్లా అధికార ప్రతినిధి వేల్పుల సుబ్రమణ్యంతో ఆ గ్రామంలో ఇంటింటికి తిరిగి టీడీపీని గెలిపించాలని కోరారు. కమలాపురం నియోజకవర్గంలో టీడీపీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

టీడీపీని గెలిపిస్తే తోపుడు బండ్ల వ్యాపారులకు ఆదరణ



చెన్నూరులో దోస కాయలు కొంటూ ఓట్లడుగుతున్న నాయకులు

చెన్నూరు, ఏప్రిల్ 21: టీడీపీతో తోపుడు బండ్ల వ్యాపారులకు ఆదరణ ఉంటుందని టీడీపీ జిల్లా మాజీ అధికార ప్రతినిధి ఇంగిరెడ్డి శివారెడ్డి అన్నారు. బతుదెరువు కోసం తోపుడు బండ్లు పెట్టుకొని వాటిపై పండ్లు, కూరగాయలు, అల్పాహారం అమ్ముకునే ప్రతి ఒక్కరికీ టీడీపీ అధికారంలోకి రాగానే తోడ్ప డతామన్నారు. ఆదివారం చెన్నూరు బస్టాండ్‌లో దోస కాయలు అమ్మే వ్యక్తి వద్దకు వెళ్లి టీడీపీని గెలిపించాలని కోరారు. జిల్లా మైనార్టీ నేత షబ్బీన్ హుస్సేన్, కరీం, చెన్నూరు పట్టణ అధ్యక్షుడు ఆకుల చలపతి, టీసీ సెల్ అధ్యక్షుడు ఆటో బాబు, బాలకృష్ణారెడ్డి, కొండాల చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

వీరపునాయునిపల్లె, ఏప్రిల్ 21: వర్షాభావం కారణంగా రైతులు తీవ్ర నీటిఎద్దడిని ఎదుర్కొంటున్నారని యుద్ధప్రాతిపదికన వారిని ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి డి మాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఖరీఫ్, రబీ సీజన్‌లలో తగినంత వర్షపాతం నమోదుకాక సాధారణ సాగుకు కూడా నోచుకోవడం లేదన్నారు.వర్షాభావంతో పంటలు కూడా పూర్తిగా ఎండిపోయి రైతాంగం పెద్ద ఎత్తున నష్టపోతున్నారన్నారు.

శివలింగానికి పూజలు

వీరపునాయునిపల్లె, ఏప్రిల్ 21: మండలంలోని సంగాలపల్లె గ్రామ సమీపంలో ఉన్న నాగభైరవేశ్వర శివలింగానికి ప్రత్యేక పూజలు జరిపించారు. ఆదివారం శివలింగానికి నిర్వాహకులు ప్రత్యేకంగా అలంకరించి శివనామస్మరణంతో ప్రత్యేక పూజలు జరిపించారు. అంతేకాకుండా విఘ్నేశ్వరునికి, నందీశ్వరునికి పూజలు జరిపించారు. ఈ కార్యక్రమంలో విజయ్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అంకాలమ్మ తిరుణాల

వల్లూరు, ఏప్రిల్ 21: మండల కేంద్రమైన వల్లూరు తూర్పు భాగాన గ్రామ దేవత అయిన మహంకాళి అంకాలమ్మ తిరుణాల ఆదివారం వైభవంగా నిర్వహించారు. తిరుణాల సందర్భాంగా అమ్మవారికి ఉదయాన్నే వివిధ పూజలు నిర్వహించి ప్రత్యేక అలంకారం గావిచారు. అనంతరం భక్తులు అమ్మవారికి నిండుకుండ బోనాలు సమర్పించి భక్తితో అమ్మవారి సేవలో తరించారు. తిరుణాలకు వల్లూరు ప్రజలతో పాటుగా చుట్టుప్రక్కల గ్రామాల నుంచి ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. అనంతరం బండలాగుడు పోటీలను నిర్వహించారు.

రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించే నేత చంద్రబాబు

● టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి




కడప నగరం 35వ డివిజన్‌లో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న మాధవీరెడ్డి...టీడీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి

కడప ఎర్రముక్కపల్లె, ఏప్రిల్ 21: రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించి ఆంధ్రప్రదేశ్‌ను నవ్యాంధ్రప్రదేశ్‌గా తీర్చి దిద్దే నాయకుడు టీడీపీ అధినేత చంద్రబాబునాయుడేనని కూటమి కడప నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి ఆర్.మాధవీరెడ్డి తెలిపారు. ఆదివారం కడప నగరం 35వ డివిజన్ నకాష్ నుంచి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ కరపత్రాలను అందజేశారు.

చంద్రబాబు ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన సూ పర్ 6 పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ఆ మె మాట్లాడుతూ రాష్ట్రంలో అందరు సంతోషంగా ఉండే పాలన రావాలంటే ముందు చూపు ఉన్న నాయకుడు చంద్రబాబును తిరిగి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలన్నారు. రానున్న ఎన్నికల్లో ఎన్‌డీఏ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలన్నారు. ప్రతి ఒక్కరు ఉమ్మడి పార్టీల అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేవారు. టీడీపీ నాయకులు మన్సూర్, జావేద్, విజయ్, పావని, జిలానిభాషా, ఖాజాపీర్, తౌసీఫ్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి భారీ చేరికలు

టీడీపీ కడప నియోజకవర్గం అభ్యర్థి మాధవీరెడ్డి ఆధ్వర్యంలో ద్వారకా నగర్‌లోని ఆమె నివాసంలో వైసీపీకి చెందిన స్థానికులు అధిక సంఖ్యలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి ఆమె టీడీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా పనిచేయాలని, టీడీపీ విజయమే లక్ష్యంగా కొనసాగాలని పిలుపునిచ్చారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక పనిచేసిన కార్యకర్తలకు గుర్తింపు ఉంటుందని చెప్పారు.

పార్టీలో చేరిన వారు

వైసీపీ నుంచి నరసయ్య, హరీష్, అంజలి, లలితతో పాటు పలువురు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి, నాయకులు మోహన్, కృష్ణారెడ్డి, వెంకటేశ్, బాస్కర్, రెడ్డయ్య, రామకృష్ణా, సుబ్బయ్య పాల్గొన్నారు.

వైసీపీ నుంచి కొనసాగుతున్న వలసల వెల్లువ





చంద్రబాబు సమక్షంలో టీడీపీలోకి చేరిన బ్రహ్మంగారిమఠం మండల వైసీపీ నేతలు, ముద్దనూరు...బీజేపీలో చేరిన వారితో ఆదినారాయణరెడ్డి

బి. మఠం, ఏప్రిల్ 21: మైదుకూరు నియోజకవర్గం బ్రహ్మంగారిమఠం మండలానికి చెందిన వైసీపీ నేతలు మాజీ మంత్రి డీఎల్ అనుచరుడు శ్రీయపురెడ్డి శ్రీనివాసులరెడ్డి, గోవిందాయపల్లె శ్రీరాములు, అంకిరెడ్డిపల్లె కొండారెడ్డి, అన్నపురెడ్డి సురేంద్రారెడ్డి, బోరెడ్డి పురుషోత్తమ్‌రెడ్డి, లింగాలదిన్నె ఓబుల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ దేవర్ల చక్రవర్తి, పెగినేని పోతులూరయ్య, బద్రయ్య, రమణయ్య, పుట్లాల శివయాదవ్, దస్తగిరి (కెడిఆర్) తదితరులు ఆదివారం మైదుకూరు నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్ యాదవ్ ఆధ్వర్యంలో చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా చంద్రబాబు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బి. మఠం మండల అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, సీనియర్ టీడీపీ నాయకులు ముడుమాల పోలిరెడ్డి, రామచంద్ర నాయుడు, రవీంద్రారెడ్డి, ఎల్లటూరు సాంబశివారెడ్డి, మల్లికార్జునరెడ్డి, ప్రముఖ న్యాయవాది పట్టాభినాయు డు, నాగయ్య, గంగరాజు, మాధవరెడ్డి, మేకల బాబు, సుబ్రమణ్యం, కొండపల్లె ఉమాకాంత్, శేషగిరి, సాయి పాల్గొన్నారు.

ముద్దనూరు..:మండలంలో భారీ ఎత్తున వైసీపీ నుంచి బీజేపీ, టీడీపీలోకి వలసలు కొనసాగుతున్నాయి. కాగా ఆదివారం బొందలకుంట గ్రామంలో బొందలకుంట, దేనేపల్లి గ్రామ పంచాయతీల్లోని వైసీపీ కి చెందిన వారు బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదినారాయణరెడ్డి సమక్షంలో దాదాపు 200కుటుంబాలు బీజేపీ కండువా కప్పుకున్నాయి.బొందలకుంట గ్రామంలో మాజీ సర్పంచ్ గాలెం సుబ్బయ్య ఆధ్వర్యంలో 50కుటుంబాలు, ఉమ్మారెడ్డిపల్లె గ్రామం శ్రీనివాసులు, రామయ్య, ఆచారి, శంకర్, కిట్టయ్య ఆధ్వర్యంలో 50కుటుంబాలు, బడుగువారిపల్లె గ్రామంలో భీమయ్య, బాలరాజు, రామ్మోహన్,అసిత్ ఆధ్వర్యంలో 50కుటుంబాలు,ఆరవేటిపల్లె గ్రామంలో ఉపసర్పంచ్ భర్త భార్గవ్, గంగప్పనాయుడు, ప్రదీప్‌కుమార్‌రెడ్డి, వెంకటేష్, సమ్మర్ ఆధ్వర్యంలో 50 కుటుంబాలు బీజేపీలో చేరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సురేంద్రనాథరెడ్డి, కమలాకర్, గోపాలకృష్ణయ్య,సాగర్,సుబ్బరాయుడు,దానంబాబు, టీడీపీ నాయకులు నాగరాజు,రామకృష్ణారెడ్డి,మహేశ్వరరెడ్డి, జనసేన నాయకులు రవి, ఎన్డీయే కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జమ్మలమడుగు..: జమ్మలమడుగు మండలంలోని దేవగుడి గ్రామంలో ఆదివారం పలువురు టీడీపీ కండువా కప్పుకున్నారు. వారిలో మైలవరంలో నివాసం ఉంటున్న దప్పెర్ల గ్రామానికి చెందిన పది కుటుంబాలవారికి దేవగుడి నారాయణరెడ్డి ఇంటి వద్ద టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి చేర్చుకున్నట్లు ఆయన తెలిపారు. చేరిన వారిలో సాగర్, బెన్ని, ఖాసీం, పవన్‌కల్యాణ్, చంటి, యేసోబు, తదితర కుటుంబాలవారు చేరారు. ఈ కార్యక్రమంలో మైలవరం క్లస్టర్ ఇన్‌చార్జి నెమలి రాజారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కాశినాయన..:మండలంలోని గంగనపల్లె గ్రామంలో ఆదివారం బద్వేల్ టీడీపీ యువనేత కే.రితీష్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన బసిరెడ్డి చెన్నక్రిష్ణారెడ్డి, బుసిరెడ్డి రమణారెడ్డి అధ్యక్షతన 60 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలోకి చేరాయి. ఈకార్యక్రమంలో జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు బంగారు గుర్విరెడ్డి,మండల టీడీపీ అధ్యక్షుడు రాజారెడ్డి, టీడీపీ నాయకులు పంగా రవీంద్రారెడ్డి హోండా రవీంద్రారెడ్డి, డి.క్రిష్ణారెడ్డి, కే.రామసుబ్బారెడ్డి, బసిరెడ్డి రమణారెడ్డి, పి.పోలిరెడ్డి, ఓ.రోహిత్‌రెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, నర్సిరెడ్డి,నరసింహులు,ముడమాల రమణారెడ్డి,దుగ్గిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.





జమ్మలమడుగు.. దేవగుడి గ్రామంలో టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి చేర్చుకున్న మాజీ ఎమ్మెల్సీ నారాయణరెడ్డి, కాశినాయన... వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిన వారితో రితీష్‌రెడ్డి

జోరుగా టీడీపీ నాయకుల ప్రచారం



ఖాజీపేట, ఏప్రిల్ 21: టీడీపీ ప్రచారాలు మండలంలో జోరుగా కొనసాగుతున్నాయి. పుట్టా సుధాకర్‌యాదవ్ గెలుపుకోసం నాయకులు ముమ్మరం ప్రచారం చేశారు. ఆదివారం మేజర్ పంచాయతీలోని టీచర్స్ కాలనీ, బస్టాండు కూడలిలో టీడీపీ మండలాధ్యక్షుడు లక్ష్మీరెడ్డి, మండల ఇన్‌చార్జి పుట్టా వెంకటస్వామి ఆధ్వర్యంలో ప్రచారం జోరుగా కొనసాగించారు. ప్రతి ఇంటికి వెళ్లి సూపర్-6 పథకాలను వివరిస్తూ ఒక్కసారి పుట్టా సుధాకర్‌యాదవ్‌కు అవకాశం ఇవ్వాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు లక్ష్మీదేవి, నాయకులు జలీల్‌అహమ్మద్, ప్రతాప్‌రెడ్డి, సుబ్బయ్య, వీరయ్య, మురళీకృష్ణ, హర్షద్, కేకే బ్రదర్స్, కిశోర్‌కుమార్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఫరూక్, పూలసుల్తాన్, షమీ, సుంకుసత్యం, తదితరులు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో..



జమ్మలమడుగులో రెండు రోజుల నుంచి ఎన్డీయే కూటమి అభ్యర్థుల తరుపున చదిపిరాళ్ల డాక్టర్ రాజేష్‌రెడ్డి, జనసేన నియోజకవర్గ కన్వీనర్ నాగార్జున, తదితరులు చేస్తున్న ఇంటింటి ప్రచారం జోరందుకుంది. ఆదివారం ఉదయం జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని కన్నెలూరు గ్రామం ఎస్సీ కాలనీలో ఎన్డీయే కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఆదినారాయణరెడ్డి, కడప పార్లమెంటు టీడీపీ ఎంపీ అభ్యర్థి భూపేశ్‌రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజేష్‌రెడ్డి, తదితరులు ఇంటింటి ప్రచారం చేశారు. కమలం గుర్తుకు, సైకిల్ గుర్తుకు ఓట్లు వేయాలని వారు కోరారు.

'తప్పుడు ప్రచారం మానుకోవాలి'

బి. కోడూరు, ఏప్రిల్ 21: వైసీపీ నాయకులు మేకవారిపల్లె గ్రామ పంచాయతీలో తప్పుడు ప్రచారాలు మానుకోవాలని ఇటీవల వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిన మాజీ ఎంపీపీ పోరెడ్డి పద్మావతి, మాజీ సర్పంచు శేషారెడ్డి, టీడీపీ రాష్ట్ర రైతు విభాగ అధ్యక్షుడు రమణారెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డితో కలసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ టీడీపీది బలుపు, వాపు అని హేళన చేసి మాట్లాడుతున్నారని బలుపు ఎవరిదో వాపు ఎవరిదో రేపు నెల 13న తేదీన తెలుస్తుందన్నారు. మేము కమిట్‌మెంట్ రాజకీయాలు చేయమని ఏ పార్టీలో ఉన్న ఏ పార్టీకి చేసిన నీతి నిజాయితీ, నిబద్ధతతో చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల ఉపాధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి, బాలిరెడ్డి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణే కాంగ్రెస్ ధ్యేయం

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 21: ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని ఆ పార్టీ ప్రొద్దుటూరు నియోజకవర్గ అభ్యర్థి పీఎండీ నజీర్ పేర్కొన్నారు. ఆదివారం సీపీఐ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్, సీపీఐ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం మధ్యాహ్నం రెండు గంటలకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నామినేషన్ వేయనున్నట్లు తెలిపారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రామయ్య మాట్లాడుతూ జగన్ పాలనలో రాష్ట్రం అభివృద్ధి శూన్యమని విమర్శించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, ఎంపీజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సలీం, జమాఅతే ఇస్లామి హింద్ జిల్లా అధ్యక్షుడు ఎన్.ఎస్.మొహిద్దీన్, ఏఐటీయూసీ నాయకుడు హరి, కాంగ్రెస్ నాయకుడు గౌస్‌లాజం పాల్గొన్నారు.

ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాలకు ప్రత్యేక సర్వీసులు

జమ్మలమడుగు, ఏప్రిల్ 21: జమ్మలమడుగు ఆర్టీసీ డిపో నుంచి ఒంటిమిట్ట కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలకు ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ ప్రవీణ్ తెలిపారు. బ్రహ్మోత్సవాలు ఏప్రిల్ 22వ తేదీన సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు సీతారాముల కల్యాణోత్సవం జరుగనుంది. భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేసినట్లు భక్తులు, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. పెద్దలకు ఛార్జీ రూ.155, పిల్లలకు ఛార్జీ రూ.85 ఉంటుందన్నారు.

రేపు చండీహోమం

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 21: స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో 23వ తేదీ మంగళవారం పౌర్ణమి సందర్భంగా చండీహోమం నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, పాలక మండలి సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. 23వ తేదీ ఉదయం 6 గంటలకు చండీ హోమం జరుగుతుందని, ఆసక్తి ఉన్న భక్తులు హోమంలో పాల్గొనాలన్నారు. హోమంలో పాల్గొనేవారు ఆలయ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

అవినీతిని తరిమికొట్టి అభివృద్ధికి ఓటేయండి



ప్రచారం చేస్తున్న గోవర్దన్‌రెడ్డి

మైలవరం, ఏప్రిల్ 21: రాష్ట్రంలో జరుగుతున్న అవినీతికి అడ్డుకట్ట వేసి రానున్న ఎన్నికలలో అభివృద్ధికి ఓటేయ్యాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మండల ఇన్‌చార్జ్ చదిపిరాళ్ల గోవర్ధన్‌రెడ్డి ఓటర్లను కోరారు.ఆదివారం మండల పరిధిలోని రామచంద్రాయపల్లి, మద్దిరెడ్డిపల్లి, లింగాపురం పంచాయతీల్లో టీడీపీ నేతలతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎన్నికలలో కడప ఎంపీగా పోటీ చేస్తున్న భూపేశ్‌రెడ్డి సైకిల్ గుర్తుకు, జమ్మలమడుగు ఎమ్మెల్యే అభ్యర్థి ఆదినారాయణరెడ్డికి కమలం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జంబాపురం రమణారెడ్డి, బీజేపీ మండలాధ్యక్షులు శ్రీనివాసులు, టీడీపీ నాయకులు నాగేశ్వరరెడ్డి, కర్నాటి రామాంజనేయరెడ్డి, అంకాల్, గోపాల్, వెంకటేష్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్డీయే కూటమి గెలిస్తేనే గ్రామాలు అభివృద్ధి



కొండాపురం, ఏప్రిల్ 21 : రాబోయే ఎన్నికల్లో ఎన్డీయే కూటమి గెలిస్తేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని మండల బీజేపీ ఇన్‌చార్జి దేవగుడి శివ నారాయణ రెడ్డి తెలిపారు.ఎన్డీయే కూటమి తరపున జమ్మలమడుగు ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆదినారాయణరెడ్డిని, కడప ఎంపీ అభ్యర్థిగా భూపేష్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు.మండలంలోని బి.కొట్టాలపల్లె,కొత్తపల్లె,ఉస్తికాయలపల్లె గ్రామాలలో ఆదివారం ఆయన ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థికి కమలం గుర్తుపైన,ఎంపీ అభ్యర్థికి సైకిల్ గుర్తుపైన ఓటు వేసి గెలిపించాలని కోరారు. కూటమి నాయకులు అరుణ్‌కుమార్‌రెడ్డి, అంకిరెడ్డి,నరసింహ పాల్గొన్నారు.

నేటి నుంచి ముక్తిరామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 21: రామేశ్వరంలోని ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి 10 రోజులపాటు ఘనంగా జరుగనున్నాయి. సోమవారం ఉదయం 8 గంటలకు సంకల్పం, విఘ్నేశ్వర పూజ, పుణ్యావాచనం, సాయంత్రం 4 గంటలకు అంకురార్పణ, అగ్నిప్రతిష్ఠాపన, ధ్వజారోహణం, రాత్రి 8 గంటలకు ఎదుర్కోళ్ల ఉత్సవం నిర్వహించనున్నారు. 23వ తేదీ ఆలయంలో శివపార్వతుల కల్యాణం, 30వ తేదీ స్వామి వారి రథోత్సవం నిర్వహించనున్నారు. ప్రతిరోజు వివిధ వాహనాల్లో స్వామి వారి గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ మార్తల రాజారెడ్డి, పాలక మండలి సభ్యులు తెలిపారు.

కూటమి అభ్యర్థి గెలుపు అభివృద్ధికి మలుపు



ప్రచారం నిర్వహిస్తున్న బొజ్జ రోశన్న, రితేష్‌కుమార్‌రెడ్డి

బద్వేలుటౌన్, ఏప్రిల్ 21 : ఎన్నికల ప్రచారంలో భాగంగా బద్వేలు పట్టణంలోని సిద్దవటం రోడ్‌లో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జ రోశన్న, టీడీపీ యువనేత రితేష్‌కుమార్‌రెడ్డి ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంచుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యధిక మెజార్టీతో బొజ్జ రోశన్నను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి

అట్లూరు, ఏప్రిల్ 21: మండలంలోని కొండూరు, గోపినాథపురం, అట్లూరు గ్రామాల్లో కూటమీ అభ్యర్థులు, బద్వేల్ బీజేపీ అభ్యర్థి బొజ్జ రోశన్న కమలం గుర్తుకు ఓటు వేయాలని కడప పార్లమెంట్ అభ్యర్థి భూపేశ్‌రెడ్డికి సైకిల్ గుర్తుకు ఓటు వేయాలంటూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు మల్లి కార్జునరెడ్డి, మండల సీనియర్ నాయకుడు బి. నందగోపాల్‌రెడ్డి, సుధారాణి, రామచంద్రారెడ్డి, నాయకులు జయకృష్ణారెడ్డి, బి. అమర్‌నాథరెడ్డి, గోపాల్‌రెడ్డి, టీడీపీ కార్యకర్తలు బి.రాజ, బి. వెంకటసుబ్బయ్య, పెంచలయ్య, తదితరులు పాల్గొన్నారు.

బొజ్జ రోశన్న గెలుపుకోసం ప్రచారం

పోరుమామిళ్ళ, ఏప్రిల్ 21: బొజ్జ రోశన్న గెలుపుకోసం బీజేపీ, టీడీపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆదివారం టైలర్స్ కాలనీ, ఎస్సీ కాలనీ తదితర ప్రాంతాల్లో కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ, టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మిద్దెలలో ఇంటింటి ప్రచారం

కాశినాయన ఏప్రిల్21: కేంద్రం, రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వాలు అధికారంలోకి వస్తే రాష్ట్రం శరవేగంగా అభివృద్ధి చెందుతుందని బద్వేల్ టీడీపీ యువనేత రితీష్‌రెడ్డి పేర్కొన్నారు.ఆదివారం టీడీపీ జనసేన,బీజేపీ నాయకులతో మిద్దెల గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.ఉమ్మడి మేనిఫెస్టోలోని 6 అంశాలను ప్రజలకు వివరిస్తూ బద్వేల్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జరోశన్న కమలం గుర్తుకు ఓటేయాలని ప్రజలను కోరారు. జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు బంగారు గుర్విరెడ్డి, ఇమాంహుస్సేన్, హోండా రవీంద్రారెడ్డి రోహిత్‌రెడ్డి, ఎల్.శ్రీనివాసులరెడ్డి పి.వెంకట్రామిరెడ్డి, కే.నరసింహారెడ్డి,బోయిళ్ళనరసింహారెడ్డి,సర్పంచ్ ఖాజావలి బీజేపీ నాయకులు మనోహర్‌రెడ్డి, నారాయణరెడ్డి జనసేన నాయకులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థిని గెలిపించండి

బి. కోడూరు, ఏప్రిల్ 21: మండల పరిధిలోని అమ్మవారిపేట, అయ్యవారిపల్లె, ఐత్రంపేట గ్రామాల్లో ఆదివారం కూటమి అభ్యర్థి బొజ్జరోశన్న, టీడీపీ మండల అధ్యక్షుడు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో కమలం గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజర్టీతో గెలిపించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రైతు విభాగ అధ్యక్షుడు రమణారెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు రామసుబ్బారెడ్డి, దుగ్గిరెడ్డి, పవన్, ఎర్రకేశవ, నవీన్, శేషారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, రామ్‌మోహన్ రెడ్డి, చెన్నారెడ్డి, రాఘవరెడ్డి, జనసేనా నాయకులు వెంకటేశ్వర్లు, సింగం శెట్టి వెంకటసుబ్బయ్య, కొర్రపాటి సురేంద్ర, వెంకటేష్, నాగార్జున, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యవారిపల్లెలో 50 కుటుంబాలు టీడీపీలో చేరిక..: కూటమి అభ్యర్థి ఎన్నికల ప్రచారంలో భాగంగా అయ్యవారిపల్లె ఎస్సీ గ్రామానికి చెందిన 50 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో అభ్యర్థి బొజ్జ రోశన్న, మండల అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, దుగ్గిరెడ్డి, పవన్ సమక్షంలో వైసీపీ నుంచి టీడీపీలో చేశారు.

కమలం గుర్తుకు ఓటెయ్యండి

టీడీపీ నియోజకవర్గ యువనాయకుడు రితీశ్‌రెడ్డి

బద్వేలు, ఏప్రిల్ 21: కమలం గుర్తుకు ఓటేసి కూటమి అభ్యర్థి రోశన్నను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని టీడీపీ నియోజకవర్గ యువనాయకుడు రితీశ్‌రెడ్డి ఓటర్లను అభ్యర్థించారు. ఆదివారం బద్వేలు పట్టణంలోని తెలుగుగంగ వీధి, శ్రీకృష్ణదేవరాయనగర్‌లలో బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అభ్యర్థి రోశన్న ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షులు వెంగళరెడ్డి, జనసేన నాయకులు దద్దం వెంకటేశ్వర్లు, వెంకటసుబ్బయ్య, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల వితరణ

కొండాపురం, ఏప్రిల్ 21: టీడీపీ తరపున కడప ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న దేవగుడి భూపేశ్‌రెడ్డికి ఆదివారం టీడీపీ అధినేత చంద్రబాబు బీ-ఫారం ఇచ్చినందుకు కొండాపురం టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జీ గోరిశెట్టిబాబు మానసిక వికలాంగులకు నిత్యావసర సరుకుల వితరణగా ఇచ్చారు.ముద్దనూరు మండలంలోని మంగపట్నం మానసిక వికలాంగుల కేంద్రంలో మానసిక వికలాంగులకు అవసరమయ్యే బియ్యం ప్యాకెట్లు,కందిబేడలు,నూనె తదితర నిత్యావసర వస్తువలను వితరణగా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సత్యబాలిరెడ్డి,తోటశివ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీ చెన్నకేశవ స్వామి, ఉగ్రనరసింహస్వామి విగ్రహ ప్రతిష్ఠ

పోరుమామిళ్ళ, ఏప్రిల్ 21: పోరుమామిళ్ళలోని రామాలయం వీధిలో లక్ష్మీచెన్నకేశవ స్వామి, ఉగ్రనరసింహస్వామి, అంకాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని పురస్కరించుకొని శని, ఆదివారాలలో గ్రామోత్సవం, పోతురాజు బోనాలు కార్యక్రమానికి పల్నాడు జిల్లా కారంపూడి నుంచి వచ్చిన భక్తులు సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే రామాయణంవీధి వాసులు, గ్రామస్థులు ఈ పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

వైభవంగా గంగమ్మకు బోనాలు



ఖాజీపేట, ఏప్రిల్ 21: ఆరుగాలం కష్టపడి పనిచేసిన రైతులు గంగమ్మతల్లికి బోనాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. మండల పరిధిలోని కూనవారిపల్లెలో గంగమ్మతల్లి రోడ్డుకు కిందిభాగంలో ఉండడంతో గ్రామస్తులు కలిసికట్టుగా గంగమ్మతల్లిని 41 రోజుల క్రితం పునర్నిర్మాణం చేశారు. అందులో భాగంగా గ్రామ మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించి వారి మొక్కులు తీర్చుకున్నారు.

మార్పు రావాలంటే పెద్దాయన వరద రావాలి



ప్రచారంలో పాల్గొన్న వరద కుమార్తెలు, మనుమరాళ్లు

ప్రొద్దుటూరు ఏప్రిల్ 21 : ప్రొద్దుటూరులో మార్పురావాలంటే పెద్దాయన నంద్యాల వరదరాజులరెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలని ఆయన కుమార్తెలు అనురాధ, అరుణ, కోడలు మీనా, మనుమరాళ్లు కోమల్, వసంత, చమేలి ఓటర్లను కోరారు. ఆదివారం హౌసింగ్ బోర్డు కాలనీలో టీడీపీ ఇంటింటి ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి భూపేశ్ సతీమణి జ్యోతి, టీడీపీ, బీజేపి, నేతలు బోగాల లక్ష్మీనారాయణమ్మ,లక్ష్మీ,బోగా శివకళ్యాణి పాల్గొన్నారు.

ఒక్కసారి అవకాశం ఇవ్వండి అభివృద్ధి చేసి చూపిస్తాం



ప్రచారం నిర్వహిస్తున్న పుట్టా ఆనంద్‌యాదవ్

బి. మఠం, ఏప్రిల్ 21: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మైదుకూరు నియోజకవర్గం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్టా సుధాకర్ యాదవ్‌కు ఒక్కసారి ప్రజలు మైదుకూరు ఎమ్మెల్యేగా ఆదరించి గెలిపిస్తే అభి వృద్ధి ఏమిటో చేసి చూపిస్తామని బ్రహ్మం గారిమఠం మండల ప్రచార సమన్వయకర్త పుట్టా ఆనంద్‌యాదవ్ ప్రజలను కోరారు. ఆదివారం మండలంలోని నాగిశెట్టిపల్లె, నందిపల్లె గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో సాంబయ్య, పొదపాటి భీమా నాయుడు, పొదపాటి వెంకటేష్‌నాయుడు, ఎంఆర్‌పీఎస్ నేత చెన్నయ్య, బుజ్జి, రవి,చిన్నసుబ్బయ్య, గంగయ్య, రవిబాబు, సుమన్, బోయపాటి సుమన్ పాల్గొన్నారు.

నేడు టీడీపీ అభ్యర్థిగా పుట్టా నామినేషన్

మైదుకూరు, ఏప్రిల్ 21 :మైదుకూరు నియోజకవర్గం టీడీపీ అభ్యర్థిగా పుట్టా సుధాకర్‌యాదవ్ సోమవారం నామినేషన్ వేయనున్నారు. ఎటువంటి హంగూ ఆర్భాటం లేకుండా ఎన్నికల కమిషన్ నియమావళి ప్రకారం ఆర్వో కార్యాలయంలో నామినేషన్ వేయనున్నట్లు తెలుస్తోంది.